PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 140 | విజయవాడ, ఆదివారం 22 డిసెంబర్ 2024 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 22 December 2024 | Rs




అదరగొట్టిన అశ్విన్ హెబ్బర్

- రైల్వేస్‌పై 91పరుగుల తేడాతో నెగ్గిన ఆంధ్ర

8



అమెరికా ఆర్థిక దిగ్బంధనాన్ని ఎత్తివేయాలంటూ

క్యూబాలో భారీ ర్యాలీ

7



అమరావతిలో 'పైసా వసూల్'

ఖర్చు చేసిన ప్రతి రూపాయి రాబట్టడానికి ప్రణాళిక

- ప్రపంచబ్యాంకుకు ప్రభుత్వ హామీ
- ప్రత్యక్ష, పరోక్ష పన్నుల మోత
- యూజర్ ఛార్జీల వాత
- తాజా నివేదికలో వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నిర్మాణానికి ఖర్చు చేసే ప్రతి రూపాయిని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి వసూలు చేయనుంది. దీనికోసం ప్రజలపై పెద్ద ఎత్తున ప్రత్యక్ష పరోక్ష పన్నులను విధించనుంది. యూజర్ ఛార్జీల మోత మోగించనుంది. ఈ మేరకు ప్రపంచబ్యాంకుకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ హామీలలోని అంశాల ఆధారంగా 'అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం' పేరిట ప్రపంచబ్యాంకు తాజాగా ఒక నివేదికను రూపొందించింది. అమరావతి నిర్మాణంకోసం రాష్ట్ర ప్రభుత్వం 15వేల కోట్ల రూపాయలకు పైగా రుణం తీసుకుంటున్న సంగతి తెలిసిందే. దీనిలో ప్రపంచబ్యాంకు 6,791 కోట్లరూపాయలను రుణంగా ఇవ్వనుంది. ఈ మొత్తాన్ని సాధారణ రుణం కాకుండా 'ఫలితాల ఆధారిత రుణం (రిజల్ట్స్ బేస్డ్ లెండింగ్-ఆర్‌బిఎల్) పద్దతిలో ఇస్తోందని, దీనికోసం ప్రపంచబ్యాంకు విధించే నిర్దేశించే లక్ష్యాలు (షరతులు)ను తప్పకుండా సాధించాల్సి ఉంటుందని ప్రజాశక్తి కొద్దిరోజుల క్రితం ప్రచురించిన విషయం విదితమే! ప్రపంచబ్యాంకు విడుదల చేసిన 62 పేజీల తాజా నివేదికలో ఈ కీలకమైన 'కాస్ట్ రికవరికి' సంబంధించిన మరికొన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. నివేదికలోని 18నుండి 21 వరకు, ఆ తరువాత మరికొన్ని పేరాల్లోనూ కాస్ట్ రికవరి, ప్రైవేటు పెట్టుబడి అభివృద్ధికి సంబంధించిన అంశాలను పేర్కొన్నారు. అయితే, ఇవి తక్షణమే కాకుండా దశలవారిగా అమలులోకి రానున్నాయి. దీనికి సంబంధించిన యంత్రాంగాన్ని కూడా ప్రభుత్వం అదే విధంగా ఏర్పాటు చేయనుంది. 'దీర్ఘకాల అమరావతి అభివృద్ధి ప్రణాళిక'గా దీనిని నివేదికలో పేర్కొన్నారు. 'క్రియాశీల ఆర్థిక , సమ్మిళత, నష్టాలను తట్టుకుని నిలిచే సుస్థిరాభివృద్ధి, పర్యావరణ హిత నగరంగా' అమరావతిని తీర్చిదిద్దడానికి ఈ చర్యలు దోహదపడతాయని వివరించారు.

స్వయం సమృద్ధిగా తొలిదశ

తొలిదశ నిర్మాణ పనులు 92 చదరపు కిలో మీటర్లలో సాగుతాయని నివేదికలో ప్రపంచబ్యాంకు తెలిపింది. ఐదు సంవత్సరాల్లో పూర్తయ్యే తొలిదశను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడమే లక్షమని పేర్కొన్నారు. జోన్1 నుండి 7వరకు, 10వ నెంబర్ జోన్‌లోనూ ఈ పనులు జరుగుతాయని, 98 శాతం సమీకరణకోసం తీసుకున్న భూముల్లోనే తొలిదశ నిర్మాణాలు ఉంటాయని నివేదికలో బ్యాంకు తెలిపింది. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు సృష్టించి, ప్రజలను అక్కడే స్థిరపడేలా ఎకనామిక్ మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. తాత్కాలిక, స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికను రూపొందిస్తామని, నిర్వహణ కోసం ప్రత్యేక ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ఒప్పందంలో తెలిపారు. ఆస్తిపన్నులు (మార్కెట్ విలువ ఆధారిత ఆస్తిపన్ను) కాస్ట్ రికవరీ టారిఫ్(ప్రభుత్వ ఆర్థికలావాదేవీలు), భూమి విలువను పెంచడం వంటి పద్దతుల్లో నిధులు సమకూర్చు కుంటామని పేర్కొన్నారు. సిఆర్‌డిఏపై ఆర్థిక భారం లేకుండా చేస్తామని

మిగతా 7లో



విజయనగరం జిల్లా డెంకాడ మండలంలో నీట మునిగిన వరి పనలు (వార్త 2లో)

అప్రమత్తంగా ఉండండి

- వర్షాల నేపథ్యంలో అధికారులకు బాబు సూచన
- రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



అల్పపీడన ప్రభావంతో ఉత్తరాంధ్రలో వర్షాలు పడుతున్న నేపథ్యంలో అన్ని స్థాయిల్లోని అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. భారీ వర్షాలు ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు ఎప్పటికప్పుడు వర్షాల సమాచారం రైతులకు చేరాలన్నారు. ఉత్తరాంధ్రలో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులతో సిఎం శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట నష్టం వివరాలు సేకరించి రైతులకు సహాయం అందేలా చూడాలన్నారు. సిఎంఒ అధికారులు ఆయా జిల్లాల్లో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై వివరించారు. భారీ వర్షాలున్న ప్రాంతాల్లో స్కూల్స్‌కు సెలవులు ప్రకటించినట్లు ముఖ్యమంత్రికి తెలిపారు.

గంటకు 8 కిలోమీటర్ల వేగంతో కదులుతున్న వాయుగుండం

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండం గడిచిన 6 గంటల్లో గంటకు 8 కిలోమీటర్ల వేగంతో తూర్పు-ఈశాన్య దిశగా కదులుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాయుగుండం ప్రస్తుతానికి విశాఖపట్నానికి 430 కిలోమీటర్లు, చెన్నైకు 490 కిలోమీటర్లు, గోపాల్‌పూర్ (ఒడిశా)కు 580 కిలోమీటర్ల దూరంలో ఉందని, తర్వాత సముద్రంలో క్రమంగా బలహీనపడే అవకాశం ఉందన్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో తీవ్ర విషాదం

- తిరుపతి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- పసిపిల్లాడితో సహా నలుగురు మృతి

సమ్మె కాలపు హామీల అమలుకు 26న ధర్నాలు

- 3, 10 తేదీల్లో ధర్నా, రిలే నిరాహార దీక్షలు

2

బీమాపై జిఎస్‌టి తగ్గింపు వాయిదా

- సెకండ్‌హ్యాండ్ కార్లపై 18 శాతం పన్ను
- జిఎస్‌టి కౌన్సిల్‌లో నిర్ణయం


7

'ఉచిత బస్సు' మరింత ఆలస్యం!

అధ్యయన కమిటీని నియమించిన ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగుదేశం కూటమి పార్టీలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో కీలకమైన 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం' పథకం అమలు మరింత ఆలస్యం కానుంది. పథకాన్ని అమలులోకి తీసుకురావడానికి బదులుగా ప్రభుత్వం తాజాగా ముగ్గురు మంత్రులతో ఒక అధ్యయన కమిటీని నియమించింది. కమిటీకి ఛైర్మన్‌గా రవాణాశాఖ మంత్రి మండేపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, సభ్యులుగా మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, హోమ్‌శాఖ మంత్రి వంగలపూడి అనిత ఉన్నారు. ఈ కమిటీ త్వరలో ప్రస్తుతం ఉచిత బస్సు ప్రయాణం పూర్తి స్థాయిలో అమలవుతున్న తెలంగాణ, కర్ణాటకతో పాటు పాక్షికంగా అమలు చేస్తున్న పలు రాష్ట్రాల్లో కూడా పర్యటించనుంది. అక్కడ అమలు తీరును పూర్తిస్థాయిలో పరిశీలించి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించనుంది. ఆ తరువాతే పథకం అమలుపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుంది. దీంతో ఈ పథకం ఎప్పటినుండి అమలులోకి వస్తుందన్న విషయం ప్రశ్నార్థకంగా మారింది. జనవరి 2న జరుగనున్న కేబినెట్ సమావేశంలో మంత్రుల బృందం పర్యటనపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిసింది.



పిపిపి పద్దతిలో...

పబ్లిక్, ప్రైవేటు పార్టనర్ షిప్ (పిపిపి) విధానంలో కిలోమీటర్ల లెక్కన ప్రైవేటు యాజమాన్యాలకు రూట్‌ల వారీగా బస్సులను కేటాయించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ విధంగా చేస్తే ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పడదనే ప్రభుత్వంలోని పెద్దలు, ఆర్‌టిసి ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు తెలిసింది.

ఎలక్ట్రానిక్ రికార్డుల బహిరంగ తనిఖీ కుదరదు

- ఎన్నికల నిబంధనలను సవరించిన కేంద్రం

న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్ రికార్డుల, వీడియోల బహిరంగ తనిఖీ ఇక కుదరదు. ఈ మేరకు కేంద్రప్రభుత్వం ఎన్నికల నిబంధనలను సవరించింది. సిసి టివి కెమెరా, వెబ్‌కాస్టింగ్ ఫుటేజ్, అభ్యర్థుల వీడియో రికార్డింగ్‌లు వంటి నిర్దిష్ట ఎలక్ట్రానిక్ పత్రాలను బహిరంగంగా తనిఖీ చేయడాన్ని నివారించింది. ఎన్నికల కమిషన్ సిఫార్సు మేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఎన్నికల నిర్వహణా నిబంధనలు, 1961లోని 93వ నిబంధనను సవరించింది. ఎన్నికలకు సంబంధించిన అన్ని పత్రాలను బహిరంగంగా తనిఖీ చేయవచ్చని రూల్ 93 పేర్కొంటోంది. తాజాగా చేసిన మార్పులో 'పత్రాలు' అన్న పదం తర్వాత 'ఈ నిబంధనల్లో పేర్కొన్న ప్రకారం' అన్న సవరణ పొందుపరిచారు. ఒక కోర్టు కేసు కారణంగానే ఈ సవరణ తీసుకొచ్చినట్లు న్యాయ శాఖ, ఇసి అధికారులు వేర్వేరుగా తెలిపారు. తాజాగా చేసిన సవరణ ప్రకారం నిబంధనల్లో ప్రస్తావించని పత్రాలు వేటినీ బహిరంగ తనిఖీకి అనుమతించేది లేదని ఇసి అధికారి వివరించారు.

బియ్యం అక్రమ రవాణాపై చర్యలేవీ?

- వి శ్రీనివాసరావు



ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వారిపై టిడిపి కూటమి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, దోషులపై చర్యలు తీసుకునే దమ్ము ఈ ప్రభుత్వానికి ఉందా? అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో జరుగుతున్న సిపిఎం జిల్లా మహాసభకు శనివారం హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్... 'సీజ్ ద షిప్' అంటూ హడావుడి చేశారే తప్ప, ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. కాకినాడ పోర్టు కేంద్రంగా లక్షల టన్నుల బియ్యం అక్రమంగా తరలిపోతున్నాయంటూ ఇటీవల పవన్ కల్యాణ్, మంత్రి మనోహర్ తనిఖీల పేరుతో హడావుడి చేశారని గుర్తు చేశారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ప్రజలకు పంచుతారని, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని రాష్ట్ర ప్రజలు అనుకున్నారన్నారు. రెండు నెలలుగా తనిఖీలు తప్ప, చర్యలు శూన్యమని తెలిపారు. పట్టుకున్న బియ్యం ఏమయ్యాయి? నిందితులు ఎవరు? వారిని అరెస్ట్ చేశారా? వంటి ప్రశ్నలకు సమాధానాలు లేవన్నారు. ఈ హడావుడి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికా? లేక బెదిరించడానికా? అని వి.శ్రీనివాసరావుప్రశ్నించారు. స్వార్ధ రాజకీయ ప్రయోజ నాలు తప్ప, ప్రజల ప్రయోజనాలు పట్టడం లేదన్నారు. కొత్తగా ఏర్పడిన కాకినాడ జిల్లా అభివృద్ధికి గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని తెలిపారు. కాకినాడ సెజ్ పేరుతో పది వేల ఎకరాల భూములను రైతుల నుంచి తీసుకున్నా పరిశ్రమలు రాలేదన్నారు. కాలుష్యం మాత్రం మిగిలిందని, చేపల వేట సాగక మత్స్యకారులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. జనసేన పార్టీలో ముఖ్య నాయకుడిగా ఉన్న ఒకాయనపై గత నాలుగేళ్ల కాలంలో బియ్యం అక్రమ రవాణా చెస్తున్నారంటూ కేసులు నమోదయ్యాయన్నారు. నేడు ఆయనకే పెద్ద పీట వేసి పార్టీలోనే పెట్టుకున్నారని దుయ్యబట్టారు. పైగా తాజాగా జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో పదవి కట్టబెట్టారన్నారు. బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిని, కేసులు నమోదైన వారిని జనసేన పార్టీలోనే పెట్టుకుని నాయకులుగా చలామణి చేస్తుంటే ఎవరికి నీతులు వల్లిస్తారంటూ ప్రశ్నించారు. సినిమా డైలాగ్స్‌లు చెప్పడం కాదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తిరిగి ప్రజలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

డెంగీతో బాలిక మృతి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి (చిత్తూరు జిల్లా)



డెంగీ జ్వరంతో బాలిక మృతి చెందిన సంఘటన చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలంలో శని వారం చోటు చేసుకుంది. మృతు రాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. నెల్లిపట్ల పంచాయతీ ఓటేరుపాలెంకు చెందిన గుణశేఖర్ కుమార్తె రక్షిత (12) కడపనత్తం హైస్కూల్‌లో ఆరవ తరగతి చదువుతున్నారు. పదిరోజుల క్రితం జ్వరం రావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగీగా వైద్యులు నిర్ధారించారు. బాలిక పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలిక మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డెంగీతో బాలిక చనిపోవడంతో మండలంలోని వైద్యసిబ్బంది అప్రమత్తమయ్యారు. గ్రామంలో శానిటేషన్, ఫాగింగ్ చేయించారు. బైరెడ్డిపల్లి మండలంలోని వెంగంవారిపల్లి, ఓటేరుపాలెం గ్రామాల ప్రజలు జ్వరంతో బాధపడుతుండడం తో ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు.

మానవ అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు

- పోలీసులకు చిక్కిన నిందితుడు
- 11 మందికి విముక్తి
- వారిలో తొమ్మిది మంది బాలికలు, ఇద్దరు యువతులు



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు (కూర్చున్న వ్యక్తి)

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

మానవ అక్రమ రవాణా ముఠా గుట్టును విశాఖ రైల్వే పోలీసులు శనివారం రట్టు చేశారు. రైళ్ల ద్వారా బాలికలను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి 11 మందికి విముక్తి కల్పించారు. వీరిని తరలిస్తున్న ముఠా సభ్యుడిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన రైల్వే సిఐ ధనుంజయ నాయుడు మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రం నుంచి బాలికలను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం విశాఖ రైల్వే పోలీసులకు అందింది. దీంతో, వారు అప్రమత్తమయ్యారు. ఒడిశాలోని నవరంగపూర్ నుంచి కోరమండల్ రైలులో బాలికలను అక్రమంగా తరలిస్తున్నట్లు నిర్ధారణకు వచ్చారు. విశాఖ రైల్వే స్టేషన్లో అనుమానంతో 11 మందిని రైలు నుంచి దించి విచారించారు. దీంతో, అక్రమ రవాణా విషయం బయటపడింది. వీరిని తిరుపూర్‌లోని బట్టల దుకాణంలో పనిచేసేందుకు తరలిస్తున్నట్లు గుర్తించారు. అందుకుగాను నకిలీ ఆధార్ కార్డులు సృష్టించినట్లు వెల్లడైంది. రైల్వే పోలీసులు విముక్తి కల్పించిన వారిలో తొమ్మిదిమంది బాలికలు, ఇద్దరు యువతులు ఉన్నారు. వారిని రవికుమార్ బిసాయ్ అక్రమంగా తరలిస్తున్నట్లు నిర్ధారణకు వచ్చారు. అక్రమ రవాణా, ఆధార్ టాంపరింగ్ కేసు నమోదు చేసి ఆయనను అరెస్టు చేశారు. విచారణ చేస్తున్న కొద్దీ పలు విషయాలు ఈ కేసులో బయటకు వస్తున్నాయని, ఈ ముఠాలో కీలక సభ్యులు ఉన్నట్టు తెలుస్తోందని రైల్వే సిఐ తెలిపారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, నేపాల్‌లోని మారుమూల ప్రాంతాల నుంచి రవికుమార్ బిసాయ్ ఇప్పటి వరకూ వంద మందికిపైగా బాలికలను అక్రమ రవాణా చేసినట్టు సమాచారం. ఈ సంఘటనలో విముక్తి కలిగిన 11 మందినీ రెస్క్యూ హోంకు తరలించారు.

ఎబిపై అభియోగాలు ఎత్తివేత

- జిఓ విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ఇంటెలిజెన్స్ మాజీ డిజి ఎబి వెంకటేశ్వరరావు పై గత ప్రభుత్వ హయాంలో మోపిన అభియోగాలను కూటమి ప్రభుత్వం తాజాగా ఎత్తివేసింది. ఈ మేరకు జిఓ ఆర్‌టి నెంబరు 2197ను శనివారం విడుదల చేసింది. నిఘా పరికరాలు కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు నేపథ్యంలో ఆయనను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆలిండియా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకంగా తనను అన్యాయంగా సస్పెండ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేశారంటూ సుప్రీంకోర్టును ఎబి ఆశ్రయించిన సంగతి తెలిసిందే. కోర్టు తీర్పు నేపథ్యంలో సర్వీసు చివరి రోజున ఎబికి డిజిగా అప్పటి ప్రభుత్వం ప్రమోషన్ ఇచ్చింది. ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డిజిగా బాధ్యతలు ఉదయం స్వీకరించి అదేరోజు సాయంత్రం ఉద్యోగ విరమణ చేశారు. అప్పట్లో ఎబిపై నమోదైన కేసులను ఎత్తివేస్తూ కూటమి ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.



పాండిచ్చేరి యూనివర్శిటీలో

ఎస్‌ఎఫ్‌ఐ క్లీన్‌స్వీప్

న్యూఢిల్లీ : పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ కూటమి విజయం సాధించింది. అన్ని స్థానాలను ఎస్‌ఎఫ్‌ఐ - బిఎస్‌ఎఫ్ కూటమి కైవసం చేసుకుంది. అధ్యక్షులుగా ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థి గాయత్రి ఎస్ కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నర్వది కుష్వంత్, నసీహా కె, కార్యదర్శిగా అపూర్వ ఎ నాయక్, సంయుక్త కార్యదర్శిగా దినేష్ ఎస్ గెలుపొందారు.

సజిత బి, రిచా సీల్, శ్రీలక్ష్మి డి, అశ్విని సి, అశ్విని పి గంగాధరన్, జెరోమ్ ఎలిక్సర్ జెఎమ్, అహ్మద్ ఫర్హాన్ పంఘాట్, శ్రీధర్ ఆర్, ఐజాస్ ఆనంద్, ఎ. సుధాష్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

2న కేబినెట్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం 2025 జనవరి రెండున ఉదయం 11 గంటలకు సచివాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరగనుంది. కేబినెట్ భేటీ నేపథ్యంలో ఆయా శాఖలకు సంబంధించిన ప్రతిపాదనలను ఈ నెల 30వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు ప్రభుత్వానికి అందజేయాలని సిఎస్ పేర్కొన్నారు. నూతన సంవత్సరం ప్రారంభంలో జరగనున్న మంత్రివర్గ సమావేశం కావడంతో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ సమావేశంలో మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత బస్సు ప్రయాణం, పోలవరం, రాజధాని అమరావతి పనులు, తల్లికి వందనం, నూతన సిఎస్ గురించి చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.



సింహాచలం, శ్రీను (ఫైల్)

పంటను చూసేందుకు వెళ్లి.. విద్యుదాఘాతంతో అన్నదమ్ములు మృతి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

పత్తిపంటను చూసేందుకు వెళ్లిన అన్నదమ్ములు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం శిఖబడిలో చోటు చేసుకుంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో శిఖబడి గ్రామానికి చెందిన వైకుంఠపు శ్రీను (47) శనివారం ఉదయం మరువాడ సమీపంలోని తమ పత్తి పొలాన్ని చూసేందుకు వెళ్లారు. పొలంలో విద్యుత్ స్తంభానికి ఉన్న జిఎ వైరును పట్టుకోవడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. పొలానికి వెళ్లిన తన అన్నయ్య ఇంటికి రాకపోవడంతో తమ్ముడు సింహాచలం (42) పొలానికి వెళ్లారు. విగతాజీవిగా పడి ఉన్న అన్నయ్యను పట్టుకోవడంతో ఆయన కూడా షాక్‌కు గురై మృతి చెందారు. శ్రీనుకు భార్య పార్వతి, ఇద్దరు కుమారులు, సింహాచలంకు భార్య లక్ష్మి, కుమార్తె,కుమారుడు ఉన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

విజనరీ నాయకుడు జగన్

- వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పార్టీ ఏర్పాటు చేసిన కేవలం పదేళ్లలో ఒక విజనరీ నాయకుడిగా, తాను ఎంచుకున్న లక్ష్యాలను కార్యరూపంలోకి తీసుకురాగలిగిన ప్రజా ప్రతినిధిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారని వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన వైఎస్ జగన్ జన్మదిన వేడుల్లో పాల్గొన్న సజ్జల మాట్లాడుతూ.. ఇచ్చిన మాటకు కట్టుబడే నాయకుడిగా ప్రజలు జగన్‌ను మెచ్చారని తెలిపారు. తొలుత సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సజ్జల కేక్ కట్ చేశారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో పలువురు నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, రుహూల్లా, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ నేతలు పుత్తా ప్రతాప్‌రెడ్డి, శివశంకర్ రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, అంకంరెడ్డి నారాయణమూర్తి, కాకుమాను రాజశేఖర్, కొమ్మూరి కనకారావు, చింతపల్లి మోహన్‌రావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మితో పాటు పలువురు పాల్గొన్నారు.

గత పదేళ్లలో ఉగ్రవాదం తగ్గింది : అమిత్ షా

అగర్తలా : దేశంలో గత పదేళ్లలో ఉగ్రవాదం తగ్గుముఖం పట్టిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. ఈశాన్య భారతంలో దాదాపు 9వేల మంది సాయుధ ఉగ్రవాదులు లొంగిపోయారని చెప్పారు. అగర్తలలో జరిగిన నార్త్ ఈస్టర్న్ కౌన్సిల్ (ఎన్ఇసి) 72వ ప్లీనరీ సమావేశంలో అమిత్ షా ప్రసంగించారు. 20 శాంతి ఒప్పందాల ద్వారా ఈశాన్య భారత్‌లో ప్రధానమంత్రి మోడీ శాంతి నెలకొల్పారని..రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో సేంద్రియ సాగుపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. ఇందుకోసం నేషనల్ ఆర్గానిక్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఒసిఎల్)ను ఏర్పాటు చేసిందన్నారు. సేంద్రీయ ఉత్పత్తుల ప్యాకేజింగ్, మార్కెటింగ్, ఎగుమతి కోసం ఎన్ఒసిఎల్‌తో ఒప్పందాలు కుదుర్చుకోవాలని ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరారు.

అదాని సంపదను పెంచే పనిలో మోడీ

- బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, పెద్దాపురం



పెద్దాపురంలో నిర్వహించిన ప్రదర్శన

ప్రజల సంపదను దోచిపెట్టి, అదాని ఆస్తులను పెంచే పనిలో ప్రధాని మోడీ ఉన్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సిపిఎం కాకినాడ జిల్లా మహాసభలో భాగంగా శనివారం పెద్దాపురంలో భారీ ప్రదర్శన, అనంతరం ఆంజనేయస్వామి గుడి సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో వి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదిహేనేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న మోడీ.. అభివృద్ధి మాట పక్కన పెట్టి అదాని సేవలో మునిగిపోతున్నారన్నారు. ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షల నగదు వేస్తామని చెప్పిన ఆయన నేటికీ 15 పైసలు కూడా వేయలేదని తెలిపారు. నిరుద్యోగులను ఆదుకుంటామని, రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఇచ్చిన హామీలన్నీ విస్మరించారని గుర్తు చేశారు. చివరకు సూర్యరశ్మిని కూడా అదానికి అమ్ముకున్నారని వివరించారు. విద్యుత్ బిల్లుల భారాలు, పన్నులు వేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారని, స్మార్ట్ మీటర్లు వద్దు అని చెప్పినా బలవంతంగా బిగిస్తున్నారని తెలిపారు. పార్లమెంటులో అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షాకు ఆ కుర్చీలో కూర్చునే అర్హత లేదన్నారు. జమిలి ఎన్నికల వల్ల రాష్ట్రాలు ఉనికిని కోల్పోతాయని తెలిపారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే జమిలి ఎన్నికలను తెరపైకి తెచ్చారన్నారు.

జిల్లాలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందనే ఆశతో పిఠాపురంలో పవన్ కల్యాణ్‌ను ప్రజలు గెలిపించారని, ఆరు నెలలు దాటినా అభివృద్ధికి ఒక్క అడుగు కూడా పడలేదన్నారు. కాకినాడ పోర్టు నుంచి బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. యాంకరేజ్ పోర్టును మూసివేసి ప్రయివేటు వ్యక్తులకు లాభాలు చేకూర్చేందుకే ఈ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. గత పాలనకు, టిడిపి కూటమి పాలనకు తేడా ఏమీ లేదన్నారు. సనాతన ధర్మం పేరుతో పవన్ కల్యాణ్ కొత్త నాటకానికి తెరలేపారని తెలిపారు. బిజెపి మతోన్మాద రాజకీయాలపై ప్రశ్నించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టిడిపి, వైసిపి, జనసేన వైఖరులను ప్రజలు గమనిస్తూ ఉండాలన్నారు. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యామ్నాయం ఎర్రజెండాతోనే సాధ్యమని తెలిపారు. బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు, జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

బలమైన వర్గ పోరాటాలు నిర్మించాలి : ఉమామహేశ్వరరావు

రానున్న కాలంలో మరిన్ని బలమైన వర్గ పోరాటాలు నిర్మించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం కాకినాడ జిల్లా 24వ మహాసభ పెద్దాపురంలోని కొప్పుల వెలమ సంక్షేమ సంఘం భవనంలో ప్రారంభమైంది. ఈ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావుతో పాటు ఉమామహేశ్వరరావు హాజరయ్యారు. మహాసభలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఆరు నెలలు కూడా గడవకముందే టిడిపి కూటమి ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. అమరావతి, పోలవరానికి కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు, కాంట్రాక్టర్ల గురించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి.. నిర్వాసితులకు రావాల్సిన రూ.35 వేల కోట్ల పరిహారం గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఈ మహాసభకు కరణం ప్రసాదరావు, జి.బేబిరాణి, సిహెచ్.రమణి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. తొలుత మహాసభ ప్రాంగణం వద్ద అరుణపతాకాన్ని సిపిఎం సీనియర్ నాయకులు దారపురెడ్డి సత్యనారాయణ ఆవిష్కరించారు.



సభలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

గంజాయి సాగును అరికడతాం

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- అల్లూరి జిల్లాలో పలు రోడ్ల పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అల్లూరి జిల్లాలో గంజాయిని పూర్తిగా అరికడతామని, అలాగే గిరిజనుల జీవన స్థితిగతుల్లో మార్పులు తీసుకొస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ అన్నారు. ఏజెన్సీలో ప్రకృతి సిద్ధంగా పండించే కాఫీ, సిరి ధాన్యాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని, టూరిజం అభివృద్ధికి పాటుపడతామని, గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పినకోట గ్రామ పంచాయతీ బల్లగరువు గ్రామంలో ఆయన శనివారం పర్యటించారు. అక్కడి నుంచే జిల్లాలో రూ.105 కోట్లతో తలపెట్టిన 19 రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లాను డోలీ మోతలు లేని జిల్లాగా మారుస్తామన్నారు. ప్రతి మారుమూల గ్రామానికీ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వాల పాలనలో గిరిజన ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. శంకుస్థాపన చేసిన 19 రోడ్ల పనులు పూర్తయితే 4,500 మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.2869 కోట్లతో దశలవారీగా ప్రతి గ్రామానికి రోడ్లు నిర్మిస్తామని, తాగునీటి ఇబ్బందులను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజల అభ్యర్థన మేరకు మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అటవీ ప్రాంతంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేసేందుకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన అదాలత్ ఏర్పాటు చేసి పట్టాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న దాని కంటే అదనపు నిధులు మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. జిఒ 3 పునరుద్ధరణ విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. తొలుత పవన్ బల్లగరువు నుంచి సుమారు మూడు కిలోమీటర్లు నడిచి వాజంగికి చేరారు. అక్కడ గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సరైన రోడ్డు సౌకర్యంలేక రోగులను ఆస్పత్రికి తరలించాలంటే డోలీయే శరణ్యమవుతోందని స్థానికులు తెలిపారు. మృతదేహాలను తరలించాలన్నా డోలీనే ఆధారమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్, ఐడిడిఎ పిఒ వి.అభిషేక్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు. విజయ్ కుమార్, జడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు, సర్పంచ్ ఎస్.గణేష్ పాల్గొన్నారు.

హత్య కుట్ర కేసులో ఏడుగురు అరెస్టు

- రెండు పిస్టల్స్, ఒక తవంచా, 46 బుల్లెట్స్ స్వాధీనం

ప్రజాశక్తి- పలాస (శ్రీకాకుళం జిల్లా)

పలాస పట్టణ టిడిపి అధ్యక్షులు, చిన్నబాడాం గ్రామానికి చెందిన బడ్డ నాగరాజు హత్యకు కుట్ర చేసిన కేసులో ఏడుగురిని అరెస్టు చేశామని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి తెలిపారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో శనివారం నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఎస్‌పి తెలిపిన వివరాల మేరకు.. నాగరాజును అంతమొందించేందుకు బీహార్‌కు చెందిన ముగ్గురు సభ్యుల గ్యాంగ్‌కు రూ.పది లక్షలు సుపారీ ఇచ్చారు. చిన్నబాడాంలో వ్యక్తిగత కక్షలు, ఆధిపత్యం, రాజకీయ విభేదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో అంపోలు శ్రీనివాసరావు, కూర్మాపు ధర్మారావు, కోత శ్రీనివాసరావు, హనుమంతు బాబురావు కలిసి నాగరాజును హత్య చేయించాలని పథకం వేశారు. ఇందుకోసం నవంబరు పదిన విశాఖలోని ఓ హోటల్‌లో బీహార్‌కు చెందిన ముగ్గురు సభ్యులను కలిసి ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందంలో భాగంగా రూ.రెండు లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించారు. అడ్వాన్స్ తీసుకున్న బీహార్ గ్యాంగ్ సభ్యులు ముగ్గురు నవంబరు 20, 30వ తేదీన నాగరాజు ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారు. వీరి అనుమానాస్పద కదలికలను గుర్తించిన కాశీబుగ్గ పోలీసులు ఈ నెల పది అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా, కుట్ర కోణం వెలుగులోకి వచ్చిందని ఎస్‌పి తెలిపారు. నిందితుల నుంచి రెండు పిస్టల్స్, ఒక తవంచా, 46 బుల్లెట్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.



నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టిన ఎస్‌పి మహేశ్వర రెడ్డి

సమ్మె కాలపు హామీల అమలుకు 26న ధర్నాలు

- 3, 10 తేదీల్లో ధర్నా, రిలే నిరాహార దీక్షలు
- మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో




మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్లు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు తెలిపారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి ముత్యాలరావు, కోశాధికారి ఎస్ జ్యోతిబసు, రాష్ట్ర నాయకులు ఎం వెంకట్రావ్, ఎ సన్నితో కలిసి విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల 17 రోజుల సమ్మె ముగిసి ఏడాదవుతున్న సందర్భంగా హామీల అమలు కోసం ఈ నెల 26న, ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపు కోసం 2025 జనవరి 3న మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు, సమ్మె కాలపు ఒప్పందాల అమలు కోసం జనవరి 10న రిలే నిరాహార దీక్షలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అదే విధంగా సంక్రాంతి అనంతరం జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. మున్సిపల్ కార్మికులు గతేడాది డిసెంబరు 26న సమ్మె ప్రారంభించి జనవరి 11 వరకూ 17 రోజుల నిరవధిక సమ్మె చేసిన సందర్భంగా ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీల అమలుకు వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం తమ సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెరుగుతాయని ఆశించారని తెలిపారు. గత ఏడు నెలలుగా ముఖ్యమంత్రి, మున్సిపల్‌శాఖ మంత్రి, మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారులను కలిసి సమ్మె కాలపు ఒప్పందాల అమలుకు జిఓ జారీ చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇంజినీరింగ్ కార్మికులకు, ఎన్ఎంఆర్, బదిలీ, కోవిడ్ కార్మికులకు జీతాలు పెంచాలని కోరామన్నారు. ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదని తెలిపారు. 17 రోజుల సమ్మె సందర్భంగా నాడు ప్రభుత్వం అంగీకరించిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా, దహన సంస్కారాల ఆర్థికసాయం పెంపు, ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపు, సంక్షేమ పథకాలు, పర్మినెంట్ కార్మికుల సరెండర్ లీవులు, జిపిఎఫ్ అకౌంట్లు తదితర హామీల ఫైల్స్ అన్నింటినీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థికశాఖ నుంచి మున్సిపల్‌శాఖ వెనక్కి తెప్పించిందని చెప్పారు. నేటికీ హామీల అమలుకు ఉత్తర్వులు జారీ చేయకపోవడాన్ని రాష్ట్ర కమిటీ నిరసిస్తుందని తెలిపారు. కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించకుండా 60 ఏళ్ల నిండాయని బలవంతంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని చెప్పారు. ఇతర శాఖల్లో ఉద్యోగ విరమణకు వయోపరిమితిని 62కు పెంచారని, మున్సిపల్‌శాఖలో పెంచలేదన్నారు. సాధారణంగా, ప్రమాదాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లంచడం, 25 నుంచి 30 ఏళ్ల ప్రాణాలు ఫణంగా పెట్టి పట్టణాల పరిశుభ్రతకు కృషి చేసిన కార్మికుల బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని చెప్పారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ఆందోళన, పోరాటాల్లో మున్సిపల్ కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

శ్రీసత్యసాయి జిల్లాలో తీవ్ర విషాదం

- బాలుడి కేశఖండనకు తిరుపతి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- పసిపిల్లాడితో సహా నలుగురు మృతి
- పది మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- మడకశిర



మృతి చెందిన తల్లీ కుమారుడు ప్రేమకుమారి, అధర్వ
రత్నమ్మ
డ్రైవర్ మనోజ్

శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలంలో శనివారం వేకువజామున తీవ్ర విషాద ఘటన చోటు చేసుకుంది. రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. పది మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతులు, గాయపడిన వారంతా కుటుంబసభ్యులు, బంధువులు. వీరికి చెందిన ఒక బాలుడికి తిరుపతిలో కేశఖండన చేయించి తిరిగి వస్తుండంగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో బాలుడు, అతడి తల్లి కూడా మృతి చెందారు. ఇందుకు సంబంధించి పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం అమరాపురం మండల కేంద్రానికి, గుడిబండ మండలం కెఎన్.పల్లికి చెందిన రిటైర్డ్ టీచర్ దాసే గౌడ్ కుటుంబ సభ్యులు, బంధువులు ఈ నెల 19న తిరుపతికి వెళ్లారు. కెఎన్‌పల్లికి చెందిన ప్రేమకుమారి (30), శివరాజ్‌ల కుమారుడు అధర్వ (3) కేశఖండన నిమిత్తం వీరంతా రెండు వాహనాల్లో తిరుపతికి చేరుకున్నారు. కేశఖండన, దైవదర్శనం అనంతరం శుక్రవారం రాత్రి కారు, తుఫాన్ వాహనాల్లో స్వగ్రామానికి బయలుదేరారు. శనివారం వేకువజామున ఐదు గంటల సమయంలో తుఫాన్ వాహనం మడకశిర మండలం బుల్లసముద్రం వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టింది. దీంతో, తుఫాన్ వాహనంలో ఉన్న తల్లీకుమారులు ప్రేమకుమారి, అధర్వ (3), అమరాపురానికి చెందిన రత్నమ్మ (60), కర్ణాటకకు చెందిన డ్రైవర్ మనోజ్ (40) ఘటనా స్థలంలోనే మరణించారు. కెంపన్న, కెంచమ్మ, గీత లక్ష్మి, సుజాతమ్మ, గిరిజమ్మ, నాగమణి, ఉష, అమాజమ్మ, శ్రీదేవి, శ్వేత తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వారిని చికిత్స నిమిత్తం మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారిలో ఉపాధ్యాయురాలు సుజాత, గిరిజమ్మ, శ్రీదేవి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వారిని బెంగళూరుకు, మరికొందరిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

ఈ ఘటనపై మంత్రి సవిత దిగ్భ్రాంతి

ఈ ప్రమాదం పట్ల రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఫోన్ ద్వారా ఆదేశించారు.



గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం మెల్లంపూడిలో జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న పి.మధు

అమిత్ షాకు మోడీ మద్దతు దారుణం

- దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలి
- అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యల పట్ల నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, కెవిపిఎస్, దళిత, ప్రజా సంఘాలు, వ్యకాస ఆధ్వర్యంలో శనివారం నిరసనలు చేపట్టారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాకు మోడీ మద్దతివ్వడం దారుణమని మండిపడ్డారు.

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం మెల్లంపూడి గ్రామంలో సిపిఎం, కెవిపిఎస్ ఆధ్వర్యాన చేపట్టిన నిరసన కార్యక్రమంలో సిపిఎం నేత పి మధు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మత విద్వేషాలు రెచ్చగొడుతూ, కులాల మధ్య మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. ఇటీవల కాలంలో దళితులు, మహిళలపై దాడులు జరుగుతుంటే ఖండించకపోవడం బిజెపి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. అమిత్ షా వ్యాఖ్యలకు బేసరత్తుగా పార్లమెంటులో క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కుంచనపల్లి, తాడేపల్లి మండలం ఉండవల్లిలో ఆందోళనలు చేశారు. అమిషా వ్యాఖ్యలను ఖండిస్తూ విజయవాడ శిఖామణి సెంటర్‌లో దళిత, గిరిజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, కౌలుదారు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గుండిమెడ క్రాంతి కుమార్, విసికె పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గంజి రామారావు పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను తూలనాడుతూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మాట్లాడడం దుర్మార్గమన్నారు. వెంటనే కేంద్ర మంత్రి వర్గం నుంచి ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా గజపతినగరం, బొబ్బిలిలో ఆందోళనలు చేపట్టారు. విజయనగరంలో డిబిఎస్‌యు ఆధ్వర్యాన అంబేద్కర్ చిత్రపటాలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంటలో ప్రజాసంఘాల ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం నేతలు ప్రదర్శన నిర్వహించారు. అన్నమయ్య జిల్లా రాజంపేటలో సిపిఎం, కలికిరిలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం నిరసనలు తెలిపారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం, కామవరపుకోటలోని పాతూరులో కెవిపిఎస్ ఆధ్వర్యాన అంబేద్కర్ విగ్రహాల ఎదుట ఆందోళనలు చేశారు. అనంతపురం, కర్నూలు, చిత్తూరు, శ్రీకాకుళం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పలుచోట్ల నిరసనలు కొనసాగాయి.

ఉత్తరాంధ్రను ముంచిన వర్షాలు

- వరి, మొక్కజొన్న, మినప, పెసర పంటలకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి - యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. వరి, మొక్కజొన్న, అపరాలు, మినప, పెసర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంట నష్టాన్ని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. విజయనగరం జిల్లాలో నాలుగు రోజుల్లో 109.6 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపిలేకుండా జల్లులు పడుతునే ఉన్నాయి. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 12532 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, అపరాల పంటకు నష్టం వాటిలినట్లు జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు తెలిపారు. పంట నష్టం వివరాలను నమోదు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలంలో కురిసిన వర్షాలకు మొక్కజొన్న పంట నీట మునిగింది. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళిలో అత్యధికంగా 16.25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, కవిటి, లావేరు, గార, బూర్జ, కోటబొమ్మాళి మండలాల్లోని పలు ప్రాంతాల్లో వరి పంట నీట మునిగింది. మినప, పెసర పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మోస్తరు వర్షం పడింది. విశాఖ జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగి వద్ద గోస్తనీ నది కాజ్‌వే వద్ద నదిలోకి ఎవరూ వెళ్లకూడదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. భీమిలి వ్యవసాయ డివిజన్ పరిధిలో నీట మునిగిన వరి, మొక్కజొన్న పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించారు.

కాలయాపనకే మంత్రివర్గ ఉపసంఘం

- పిసిసి అధ్యక్షులు షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళలకు ఉచిత బస్సు హామీ వెంటనే అమలు చేసి, ఇచ్చిన మాట నిలబెట్టుకుని, చిత్తశుద్ధి నిరూపించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ప్రభుత్వ వైఖరి మంత్రివర్గ ఉపసంఘం పేరుతో మరింత కాలయాపన చేసేందుకు చూస్తోందని స్పష్టమవుతుందని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్‌టిసి ప్రకటించినా, ప్రభుత్వం మీనమేషాలు ఎందుకు లెక్కిస్తుందని శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె ప్రశ్నించారు. కాలయాపన చేయడం తప్ప ఇచ్చిన హామీ నిలబెట్టుకునే బాధ్యత ప్రభుత్వానికి కనిపించడం లేదన్నారు. అధికారం చేపట్టిన 6 నెలల్లో పండగలు, పబ్బాలు పేరు చెప్పి దాటవేశారని, అనంతరం బస్సులు కొంటున్నామని చెప్పుకొచ్చారని, తాజాగా మంత్రివర్గ ఉపసంఘం పేరుతో మరికొన్ని రోజులు సాగదీతకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే పథకం అమలు చేసి చూపించారని ఈ సందర్భంగా తెలిపారు. జీరో టికెట్ల కింద నెలకు రూ.300 కోట్లు ఆర్‌టిసికి ఇవ్వడానికి ప్రభుత్వం నిధులు ఖర్చు చేయలేదా? అంటూ ప్రశ్నించారు.

ఆప్కాబ్, డిసిసిబిల్లో పర్సన్ ఇన్‌ఛార్జుల పాలన పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ (ఆప్కాబ్)లో ప్రత్యేక అధికారి (పర్సన్ ఇన్‌ఛార్జి) పాలన మరో ఆరు నెలలు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2025 జనవరి 18 నుంచి జులై 17 వరకూ పర్సన్ ఇన్‌ఛార్జి పాలన పొడిగించినట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డిసిసిబి)ల్లో పర్సన్ ఇన్‌ఛార్జి పాలనను కూడా ప్రభుత్వం పొడిగించింది. ఇందుకు స్పెషల్ సిఎస్ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. కృష్ణా, ప్రకాశం, కడప, చిత్తూరు, నెల్లూరు, గుంటూరు, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కర్నూలు, విశాఖపట్నం, విజయనగరం, అనంతపురం మొత్తం 13 జిల్లాల్లో ఉన్న డిసిసిబిల పర్సన్ ఇన్‌ఛార్జుల పాలనను ఎన్నికలు నిర్వహించి కొత్త పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టే వరకూ పొడిగిస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బెనిఫిట్ షోను నిషేధించాలి : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం తరహాలో రాష్ట్రంలోనూ సినిమా టికెట్ల ధరలు పెంచడం, బెనిఫిట్ షోలను అనుమతించడం నిషేధించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ కోరింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎపి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు సినిమా టికెట్ల ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచుతూ, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పరిపాటిగా మారిందని పేర్కొన్నారు. ఇది ప్రేక్షకుల, ప్రజల జేబులను కొల్లగొట్టడమేనన్నారు. పెద్ద హీరోల సినిమాలు వందల కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌లతో ఏళ్ల తరబడి చిత్రీకరణతో నిర్మించి, కలెక్షన్ల కోసం టికెట్ ధరలను పెంచాలని నిర్మాణ సంస్థలు ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నాయన్నారు. ఈ విధానాలను సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇకపై తెలంగాణలో సినిమా టికెట్ ధరలు పెంచేందుకు, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతినివ్వబోమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై అభినందనలు తెలిపారు.

ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు ఉద్యమం

- విశాఖ ఉక్కుకు సొంత గనులు ఎందుకివ్వరు ?
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు
- అనకాపల్లి సిపిఎం జిల్లా మహాసభ ప్రారంభం
- నర్సీపట్నంలో ర్యాలీ, బహిరంగ సభ


నర్సీపట్నంలో సాగుతున్న భారీ ర్యాలీ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులపై దాడి చేస్తోందని, ఈ క్రమంలో హక్కుల పరిరక్షణకు ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై మాట్లాడినా, నిరసనలు తెలిపినా వారిపై అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేయడం దారుణమని తెలిపారు. సిపిఎం అనకాపల్లి జిల్లా 24వ మహాసభ శనివారం నర్సీపట్నంలో ఘనంగా ప్రారంభమైంది. తొలుత స్థానిక ఎల్ఐసి కార్యాలయం నుండి మెయిన్ రోడ్డు, కృష్ణా బజార్ మీదుగా అబిద్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన సిపిఎం కార్యకర్తలు, సానుభూతిపరులు, ప్రజలు ఎర్రజెండాలు చేబూని ర్యాలీలో పాల్గొన్నారు. డప్పుల దరువులు, తప్పెటగుళ్ళు, కోలాటం, థింసా నృత్యాల నడుమ ఉత్సాహంగా ర్యాలీ సాగింది. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అబిద్ సెంటర్‌లో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్య హక్కులు, ఉద్యమాలపై అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పిన ప్రధాని మోడీ పదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని తెలిపారు. ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా, రైతుల పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా, ఉపాధి హామీ బడ్జెట్ పెంచకుండా, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించకుండా దేశం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు. కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా మార్చేశారని తెలిపారు. విభజన చట్టంలోని హామీలను మోడీ ప్రభుత్వం అమలు చేయలేదని, వెనుకబడిన ప్రాంత అభివృద్ధి నిధులను ఈ ప్రాంతానికి ఇవ్వలేదని వివరించారు. ఎంతో చరిత్ర కలిగిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు ఎందుకు కేటాయించడంలేదని ప్రశ్నించారు. నక్కపల్లి ప్రాంతంలో మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు కారుచౌకగా భూములు కట్టబెట్టి రాయితీలు కల్పించడానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయే తప్ప ప్రభుత్వరంగ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాలన్న ఆలోచనలో లేవన్నారు. చిత్తశుద్ధి ఉంటే మిట్టల్ స్టీల్‌ప్లాంట్ అనుమతులు రద్దు చేసి విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్‌డిఎ భాగస్వామ్యపక్షాలైన టిడిపి, జనసేనలు స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించుకోవాలని, మిట్టల్ స్టీల్‌ను ఏర్పాటు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ నాన్ షెడ్యూల్ గిరిజన ప్రాంతాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. నర్సీపట్నం కేంద్రంగా ఐటిడిఎ ఏర్పాటు చేయాలని కోరారు. పార్టీ అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ జిల్లాలో మూతపడ్డ తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సహకార షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలని కోరారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తిచేసినప్పుడే సాగునీటి సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. అనకాపల్లి ఎంపి సిఎం రమేష్ విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యను పట్టించుకోవడంలేదన్నారు. వేదికపై పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.ప్రభావతి, జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, డి.వెంకన్న తదితరులు ఉన్నారు. అనంతరం ప్రతినిధుల సభ ఎ.బాలకృష్ణ నగర్, సత్తిబాబు ప్రాంగణం, మళ్ల సత్యనారాయణ వేదికగా ప్రారంభమైంది. సీతారాం ఏచూరి చిత్రపటానికి వై.వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతినిధుల సభకు అధ్యక్షవర్గంగా డి.వెంకన్న, ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, డిడి.వరలక్ష్మి వ్యవహరించారు.


నూతన బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఆర్‌టిసిలో ఖాళీలు భర్తీ చేస్తాం

- 2 వేల విద్యుత్ వాహనాలు అందుబాటులోకి తెస్తాం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎపిఎస్ ఆర్‌టిసిని పూర్తిగా ప్రక్షాళన చేసి మరింత బలోపేతం చేస్తామని, ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని రాష్ట్ర రోడ్డు రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. కొత్తగా 2 వేల విద్యుత్ వాహనాలను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చి సంస్థకు మరింత ఊతమివ్వనున్నట్లు చెప్పారు. పార్వతీపురం బస్టాండ్ ఆవరణలో ఆరు నూతన బస్సులను ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతమైన పార్వతీపురం మన్యం జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. కనీస వసతులు లేకుండా జిల్లాల పునర్విభజన జరిగిందని, తద్వారా జిల్లాలో గానీ, నియోజకవర్గాల్లో గానీ సరైన రోడ్లు, మౌలిక సదుపాయాలు లేవని తెలిపారు. ముఖ్యంగా గత 50 ఏళ్ల నాటి ఆర్‌టిసి కాంప్లెక్స్, డిపో కనీస వసతులకు నోచుకోలేదని, ముఖ్యమంత్రితో చర్చించి త్వరలోనే ఆధునిక హంగులతో ఆర్‌టిసి బస్టాండ్, డిపోలను నిర్మిస్తామని చెప్పారు. జిల్లాకే తలమాణికంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇండోర్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్‌టిఒ, ఎంవిఐఒలకు కొత్త భవనాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. విద్యుత్ వాహనాలకు సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. అనంతరం ఆర్‌టిసిలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బి.విజయచంద్ర, ఆర్‌టిసి జోనల్ ఇడి ఆకాశపు విజయకుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి కె.శ్రీనివాసరావు, పార్వతీపురం డిపో మేనేజర్ ఇఎస్‌కె దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో కెవిబి 209 శాఖలకు విస్తరణ

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రయివేటు రంగంలోని కరూర్ వైశ్యా బ్యాంక్ తెలుగు రాష్ట్రాల్లో 209 శాఖలకు విస్తరించినట్లు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లో అనంతపూర్‌లో, తెలంగాణలోని నిజామాబాద్‌లో కొత్త శాఖలను ఏర్పాటు చేయడం ద్వారా ఈ స్థాయికి చేరినట్లు పేర్కొంది. దీంతో దేశంలో తమ నెట్‌వర్క్ 864 శాఖలకు చేరిందని ఆ బ్యాంక్ వెల్లడించింది. 2024-25లో 26 కొత్త శాఖలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. నూతన శాఖల్లోనూ సేవింగ్ ఖాతాలు, డిపాజిట్లు, పొదుపులు, కరెంట్ ఖాతాలు, లాకర్ సౌకర్యాలతో సహా రుణాలు వంటి సమగ్రమైన బ్యాంకింగ్ సేవలను అందించనున్నట్లు పేర్కొంది.

ప్రకాశం జిల్లాలో స్వల్ప భూప్రకంపనలు

ప్రజాశక్తి-ముండ్లమూరు (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లాలో స్వల్ప భూప్రకంపనలు వచ్చాయి. ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో శనివారం ఉదయం భూమి కంపించింది. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ముండ్లమూరు మండలంలోని ఈదర, పూరిమెట్ల, భీమవరం, ఉమామహేశ్వరపురం, పోలవరం, శంకరాపురం, వేముల తదితర గ్రామాల్లో పెద్ద శబ్దంతో కొన్ని సెకండ్లపాటు భూమి కంపించడంతో ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి జనాలు బయటకు పరుగులు తీశారు. భూ కంపానికి ఇళ్లల్లోని సామాన్లు కిందపడిపోయాయి. గోడలు నెర్రెలిచ్చాయి. గత నాలుగు సంవత్సరాలలో ఏడు సార్లు భూ ప్రకంపనలు రావడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

గ్రీన్ ఎనర్జీ వైపు వేగంగా అడుగులు

- విద్యుత్ ఆదాతోనే భావితరాలకు భరోసా
- ఇంధన వారోత్సవాల్లో విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రీన్ ఎనర్జీ వైపు రాష్ట్రం వేగంగా అడుగులు వేస్తోందని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. విజన్-2027లో భాగంగా 50-60 శాతం గ్రీన్ ఎనర్జీ రాష్ట్రంగా ముందుకెళ్లాలని చెప్పారు. జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఇంధన పరిరక్షణ అవార్డుల ప్రదానోత్సవం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శుక్రవారం ఎపి రాష్ట్ర ఇంధన పరిరక్షణ సమితి (ఎపిఎస్ఇసిఎం) సిఇఒ బివిఎపి కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఇంధనశాఖ, ఎపిఎస్ఇసిఎం ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమానికి విజయానంద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ స్థాయిలో ఇంధన పొదుపులో రాష్ట్రం వరుసగా మూడో ఏడాది అవార్డు సాధించిందని చెప్పారు. పాఠశాల స్థాయి నుంచే ఇంధన పొదుపు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సోలార్ పరికరాలతో విద్యుత్ ఆదాతో పాటు విద్యుత్ ఉత్పత్తిదారులుగా ఉంటామన్నారు. జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ.. దేశంలో విద్యుదుత్పత్తిలో బొగ్గు ఆధారిత ప్లాంట్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. విద్యుత్ వృథా చేయడం వల్ల సహజ వనరుల లభ్యత వేగంగా తరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక యూనిట్ విద్యుదుత్పత్తికి 0.8 కెజీల బొగ్గు ఖర్చవుతుంటే దేశవ్యాప్తంగా 1.2 బిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఏటా విద్యుదుత్పత్తికి ఉపయోగిస్తున్నామని చెప్పారు. దేశంలో కేవలం 7 రాష్ట్రాల్లోనే బొగ్గు గనులు ఉన్నాయని, అక్కడి నుంచే మిగిలిన రాష్ట్రాలకు సరఫరా జరుగుతోందన్నారు. ఈ బొగ్గు సరిపోక విదేశాల నుంచి కూడా అధిక ధరకు దిగుమతులు చేసుకుంటున్నామని వివరించారు. విద్యుత్‌ను పొదుపు చేస్తే భవిష్యత్ తరాలకు సహజ వనరులను అందించగలమని, లేదంటే మరలా పాత చీకటి రోజులు వస్తాయని తెలిపారు. ఎపిసిపిడిసిఎల్ సిఎమ్‌డి పి రవిసుభాష్ మాట్లాడుతూ బిఇఇ స్టార్ రేటెడ్ గృహోపకరణాలు, ఇంధన సామర్థ్య ఉపకరణాలను ఇళ్లల్లో వినియోగించాలని చెప్పారు. అనంతరం ఇంధన పరిరక్షణ అవార్డులు సాధించిన వారికి బహుమతులు అందజేశారు.

నోరుమూసుకుని పోండి

- రైతులపై తహశీల్దార్ దురుసు ప్రవర్తన

ప్రజాశక్తి -వలేటివారిపాలెం (నెల్లూరు)

నెల్లూరు జిల్లా వలేటివారిపాళెం మండలంలోని కొండసముద్రం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులపై తహశీల్దార్ దురుసుగా ప్రవర్తించారు. రైతులు తెలిపిన వివరాల మేరకు..

గ్రామంలో నిర్వహించిన సదస్సుకు పలువురు రైతులు హాజరయ్యారు. ఇటీవల బదిలీ అయిన విఆర్ఒ తమ వద్ద రూ. ఆరు లక్షలు వసూలు చేశారని, అయినా తమ సమస్యను పరిష్కరించలేదని పలువురు రైతులు పేర్కొన్నారు. రైతుల సమస్యలు పరిష్కారం కానప్పుడు రెవెన్యూ సదస్సులు ఎందుకని రైతులు ప్రశ్నించారు. దీంతో తహశీల్దార్ షేక్ అబ్దుల్ హమీద్ అసహనం వ్యక్తం చేస్తూ 'నోరుమూసుకుని పోండి' అంటూ రైతులపై దురుసుగా ప్రవర్తించారు. సదస్సుకు హాజరైన పలువురు రైతులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం తహశీల్దార్ కూడా వెళ్లిపోయారు. రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరించాల్సిన అధికారే రైతులపై దురుసుగా ప్రవర్తించడంపై మండలంలో చర్చనీయాంశమైంది.

వలంటీర్ వ్యవస్థ కొనసాగించాలని ధర్నా

- ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వలంటీర్లు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఎపి గ్రామ వార్డు వలంటీర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. తొలుత సిఐటియు కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ.. వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, రూ.ఐదు వేల నుంచి రూ.పది వేలకు జీతం పెంచుతామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటినా వలంటీర్ల వ్యవస్థ పట్ల ఇప్పటి వరకూ నిర్ణయం తీసుకోకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో 2.60 లక్షల మంది విద్యావంతులైన యువతీ, యువకులు వలంటీర్లుగా తమ సేవలను ఐదేళ్లు అందించారని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్ వ్యవస్థ కొనసాగింపుపై టిడిపి కూటమి ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎపి గ్రామ, వార్డు వలంటీర్స్ యూనియన్ ఏలూరు నగర అధ్యక్షులుగా కె.పృథ్వీరాజ్, కార్యదర్శిగా బి.బెహరాను ఎన్నుకున్నారు. పదకొండు మందితో కమిటీ ఎన్నికైంది.

జలజీవన్ మిషన్ నిధులు తీసుకొస్తాం : పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రానికి కేటాయించిన జలజీవన్ మిషన్ నిధులు ఈ ఏడాది కూడా వస్తాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లో 20 సూత్రాల అమలుపై శనివారం జరిగిన సమీక్ష సమావేశానికి ఆయన హాజరయ్యారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లాలో అమలవుతున్న పథకాలపై సమీక్షించారు. అనంతరం పెమ్మసాని మీడియాతో మాట్లాడుతూ.. 2019 నుంచి 2024 మధ్యలో జలజీవన్ మిషన్ పథకం నిధులను వినియోగించుకోలేకపోవడం వల్ల ఆ నిధులు వెనక్కి వెళ్లాయన్నారు. రాష్ట్రానికి రూ.14 వేల కోట్లు కేటాయిస్తే వైసిపి హయంలో కేవలం రూ.2 వేల కోట్లు ఖర్చు చేశార తెలిపారు. ఆ నిధులను తిరిగి రాష్ట్రానికి తీసుకురావడానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం అవసరమని, ఇందుకు సిఎం చంద్రబాబు తన వంతు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా ఇచ్చి ఉంటే రాష్ట్రానికి రూ.20 వేల కోట్లతో ప్రతి ఇంటికి ఇప్పటికే కుళాయి కనెక్షన్లు వచ్చి ఉండేవని పేర్కొన్నారు. గత ఐదేళ్లు ఈ పథకం గురించి పట్టించుకోకపోవడం వల్ల ఎంతో నష్టం జరిగిందన్నారు. పనుల అంచనా వ్యయాలు కూడా మారిపోయాయని తెలిపారు. 20 సూత్రాల ఆర్థిక కమిటీ అమలు చైర్మన్ లంక దినకర్ మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాల అమలును వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. అన్ని జిల్లాల్లో ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష చేస్తామన్నారు. సమావేశంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, ఎమ్మెల్యే నశీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వామపక్ష నాయకులు

అదానితో విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాల్సిందే

- 'నమో అదాని కరెంట్ కహానీ' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అదానితో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ రాసిన 'నమో అదాని కరెంట్ కహానీ' పుస్తకాన్ని సిపిఎం కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ, కార్పొరేట్ దిగ్గజం గౌతమ్ అదానిల బంధం ఎంత గాఢంగా పెనవేసుకుపోయిందో చెప్పడానికి తాజాగా అమెరికాలో బయటపడిన కేసు ఒక గొప్ప ఉదాహరణ అని అన్నారు. ఆస్ట్రేలియా నుంచి అదాని కంపెనీ దిగుమతి చేసుకున్న బొగ్గును అధిక ధరలకు రాష్ట్రాలకు అంటగట్టడానికి రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం ఎలా ఒత్తిడి తెచ్చిందో వెల్లడైందని తెలిపారు. అదాని లంచాల కుంభకోణం బయటపడిన తరువాత కూడా ప్రధాని వెనకేసుకు రావడం సిగ్గుచేటన్నారు. అదానిపై చర్యలు తీసుకోకపోగా రక్షించడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం సిగ్గుచేటని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మోడీ అడుగుజాడల్లోనే నడుస్తూ అదానీపై ఈగ వాలనీయడం లేదని విమర్శించారు. సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, కోనారి మోహనరావు, గంగరాపు సింహాచలం, పి.తేజేశ్వరరావు, కార్యక్రమంలో ప్రజాశక్తి మేనేజర్ ఎస్.కామినాయుడు పాల్గొన్నారు.

సిసిఐ పత్తి కేంద్రాల్లో సిసి కెమెరాలు

- హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

మార్కెట్ కమిటీ ఏరియాల్లో ఉన్న జిన్నింగ్ కాటన్ మిల్లులు/సిసిఐ కొనుగోలు కేంద్రాల్లో వారం రోజుల్లోగా సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని మార్కెటింగ్ శాఖకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. సిసి కెమెరాల ఏర్పాటు వల్ల అప్పులు చేసి సాగు చేసుకునే సామాన్య మధ్యతరగతి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని హైకోర్టు అభిప్రాయపడింది. జిన్నింగ్ మిల్లులో పనిచేసే సిబ్బంది పనితీరు కూడా మెరుగుపడుతుందని అభిప్రాయపడింది. మోసాలు, అక్రమాలను అరికట్టేందుకు దోహదపడుతుందని పేర్కొంది. పత్తి పంట కొనుగోళ్లు మరింత పారదర్శకంగా జరుగుతాయని చెప్పింది. సిసిఐ పత్తి కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలంటూ గుంటూరుకు చెందిన బి అశోక్, సిసిఐ మాజీ మేనేజర్ గోగినేని సాయి ఆదిత్య దాఖలు చేసిన కేసుల్లో హైకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

రాతపూర్వకంగా తెలియజేయాల్సిందే

మోటారు వాహనం లేదా వాణిజ్య వాహనాలను వాటి యజమానులు రోడ్లపై నడపకూడదని నిర్ణయం తీసుకున్నప్పుడు ఆ విషయాన్ని రాత పూర్వకంగా రవాణా శాఖకు తెలియజేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అలాంటి వాహనాలకు యజమానులు పన్ను మినహాయింపు కోరడానికి వీలవుతుందని పేర్కొంది. తమ వాహనాలు నడపడం లేదు కాబట్టి పన్ను మినహాయింపు ఇవ్వాలని తర్వాత కోరడం సబబు కాదని వెల్లడించింది. రాతపూర్వక సమాచారం ఇచ్చినప్పుడే పన్ను మినహాయింపు జరగాలని తెలిపింది.

తమ వాహనాలు విశాఖ స్టీల్‌ప్లాంట్ లోపలున్న సెంట్రల్ డిశ్పాచ్ యార్డ్ (సిడివై)లో తిరుగుతున్నాయని, సిడివై 'బహిరంగ ప్రదేశం' కిందకు రాదు కాబట్టి మోటారు వాహన పన్ను మినహాయింపు వర్తిస్తుందన్న తారాచంద్ లాసిజిక్ సొల్యూషన్స్ లిమిటెడ్ వాదనను తిరస్కరించింది. ఎపి మోటారు వాహన పన్నుల చట్టంలోని సెక్షన్ 12ఏకు వ్యతిరేకమని వెల్లడించింది. కనుక తారాచంద్ కంపెనీ చెల్లించిన రూ.22.71 లక్షల పన్నును తిరిగి వారికి వెనక్కి ఇవ్వాలని రవాణా అధికారులను ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది.

జెట్‌వర్క్‌కు రూ.760 కోట్ల నిధులు

- రూ.2633 కోట్లకు చేరిన విలువ




న్యూఢిల్లీ: జెట్‌వర్క్ మానుఫాక్చరింగ్ బిజినెస్ ఇటీవల 90 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.760 కోట్లు) నిధులు సమీకరించినట్లు వెల్లడించింది. దీంతో కంపెనీ మొత్తం విలువ 3.1 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.2,633) కోట్లకు చేరిందని తెలిపింది. ఇటీవల సంస్థలకు నిధులు సమకూర్చిన వాటిలో రాకేష్ గంగ్‌వాల్, కోస్లా వెంచర్స్ సహా కొత్త ఇన్వెస్టర్లు బెయిలీ గిఫోర్డ్, అవెనిర్ గ్రోత్ తదితర సంస్థలున్నాయి. 2023-24లో సంస్థ స్థూల సరుకుల విలువ (జిఎంవి) రూ.17,564 కోట్లుగా ఉందని తెలిపింది. తమ సంస్థ పునరుత్పాదన ఇంధనం, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, ఎరోస్పేస్ రంగాల్లో విస్తరణ, పెట్టుబడులు పెట్టాలని యోచిస్తోందని తెలిపింది. 2024 సెప్టెంబర్ 30 నాటికి కంపెనీ ఆర్డర్లు రూ.12,839 కోట్లుగా నమోదయ్యాయని పేర్కొంది.

ఎంపి అవినాష్ పిఎను విచారించిన పోలీసులు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్.అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డిని శనివారం పులివెందుల పోలీసులు విచారించారు. ఈ నెల 9, 10, 11, 13వ తేదీలలో కడప క్రైమ్ బ్రాంచ్ పోలీసు స్టేషన్‌లో పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. వర్రా రవీంద్రారెడ్డి కేసులో రాఘవరెడ్డి నిందితులుగా ఉన్నారు. వై.ఎస్.విజయమ్మ, వై.ఎస్.షర్మిల, వై.ఎస్.సునీతలపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాలని రాఘవరెడ్డి కంటెంట్ ఇస్తేనే తాను పోస్టు చేసినట్లు అంగీకరించారు. అవసరమైతే మళ్లీ విచారణకు హాజరుకావాలని ఆయనకు పోలీసులు తెలిపినట్లు సమాచారం.


విచారణకు హాజరైన ఎంపి పిఎ రాఘవరెడ్డి

హోండా కార్లు 2 శాతం ప్రియం

న్యూఢిల్లీ : పలు ఆటోమొబైల్ కంపెనీల బాటలోనే హోండా కార్స్ కూడా ధరలను పెంచాలని నిర్ణయించింది. కొత్త ఏడాదిలో తమ వాహన ధరలను 2 శాతం వరకు పెంచబోతున్నట్లు వెల్లడించింది.

వ్యయం, రవాణ ఖర్చులు పెరగడంతో కంపెనీపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవాలని నిర్ణయించామని హోండా కార్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కునల్ బెహ్ల తెలిపారు.

సంపాదకీయం


సమ భావం!

రెండువేల ఏళ్లనాటి మనువాదం ఇప్పటికీ భారతీయ సమాజాన్ని ఏదో ఒక రూపంలో పీడిస్తూనే వుంది. 'స్త్రీ ఎప్పుడూ తండ్రి, భర్త, కొడుకు సంరక్షణలోనే వుండాలని, వేధించి హింసించే భర్తను కూడా పూజించాలి' అనే పురుషాధిక్య భావజాలాన్ని ఆధునిక యుగంలోనూ చలామణీ చేసేందుకు మనువాదులు యత్నిస్తున్నారు. దానికి నిదర్శనమే నేటికీ కొనసాగుతోన్న లింగ వివక్ష. స్త్రీ పట్ల సమాజం ఎంత అమానవీయంగా ప్రవర్తిస్తోందో తెలుపుతూ... 'నువ్వు ఆడదానివి, గీత దాటకూడని దానివి, మచ్చపడితే మాయని దానివి' అంటుందని చెబుతారు అబ్బూరి ఛాయాదేవి. ఈ మచ్చలు, గీతలు స్త్రీలకే గాని పురుషులకు లేవంటుందీ సమాజం. ఈ సమాజంలో అమ్మాయిలకు అడుగడుగునా అవరోధాలే.. వారి కదలికలపై ఎన్నో ఆంక్షలు, నిర్బంధాలు. పాప-బాబు, అమ్మాయి-అబ్బాయి, మహిళ-పురుషుడు అన్న ఈ పదాల మధ్య గీతలు చెరిపేసి, సమానం అని చెప్పాలనుకున్నా, పురుషాధిపత్య భావజాలం ఏదోఒక రూపంలో మొలకెత్తుతూనే వుంది. ఇంట్లో కనీసం ఒక్క మగపిల్లాడైనా వుండాలని కోరుకునే భావన బలంగా వేళ్లూనుకుని వుంది. అమ్మాయిలైతే పెళ్లి తర్వాత అత్తవారింటికి వెళ్లిపోతారు, అదే అబ్బాయిలైతే వృద్ధాప్యంలో తమ బాగోగులు చూసుకుంటారని, తమకు ఆదరువుగా వుంటారని కొందరు తల్లిదండ్రులు భావిస్తుంటారు. కానీ, కొడుకు కంటే కూతురే నయమని అనుభవం చెబుతోంది.

సమాజం అన్ని రంగాల్లోనూ మారుతున్నా... అమ్మాయిలు-అబ్బాయిల పెంపకం విషయంలో మాత్రం పెద్దగా మార్పు చోటుచేసుకోలేదు. 'వాడికేం? మగమహారాజని/ ఆడా, మగా వాగినప్పుడే అర్థమైపోయింది/ పెళ్లంటే పెద్ద శిక్ష అని/ మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడని/ మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే/ మమ్మల్ని విభజించి పాలిస్తోందని' అంటారు సావిత్రి. ఈ తరహా విభజన ప్రాథమిక పాఠ్యాంశాల నుంచి సాహిత్యం వరకూ, సీరియళ్ల నుంచి సినిమాల వరకూ అబ్బాయిలకు ప్రాధాన్యతనివ్వడం చూస్తూనే వున్నాం. విద్యలోనూ వివక్షతే. మగపిల్లలను బయట చదువులకు పంపించే తల్లిదండ్రులు... ఆడపిల్లలను పంపడానికి సంకోచిస్తారు. ఎవరో ఒకరినే చదివించాల్సిన పరిస్థితివుంటే... అబ్బాయిలకే ప్రాధాన్యతనిస్తారు. పిల్లల పుట్టుక దగ్గర నుంచి పెంపకం వరకూ ఈ వివక్ష అడుగడుగునా కొనసాగుతూనే వుంది. గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలిస్తే పిండ దశలోనే అంతమొందిస్తున్నారు. 'జనాభా లెక్కల్లో స్త్రీలకంటే పురుషుల సంఖ్యే ఎక్కువ' అని కేంద్ర ప్రభుత్వం గత వందేళ్లుగా నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నివేదికలు చెబుతున్నాయి. ఇదంతా పురుషాధిపత్య భావజాల ఫలితమే. 'భ్రష్టుడా! / అమ్మ రుణం తీరదురా/ అమ్మకు అమ్మవై పుడితే తప్ప' అంటారు ఆచార్య గోపి. ఈ మార్దవం అబ్బాయిల్లో జీర్ణించుకునేలా పెంచడం తల్లిదండ్రుల బాధ్యత.


అమ్మాయి, అబ్బాయి సమానమేనన్న భావన ఇంటి నుంచి, చిన్న వయసు నుంచే మొదలవ్వాలి. అది తల్లిదండ్రుల బాధ్యత. ఇంటర్నెట్ యుగంలో... సోషల్‌మీడియా, ఏఐ వంటి మాధ్యమాలు అందుబాటులో వున్న నేపథ్యంలో టీనేజ్ పిల్లల భావోద్వేగాలను నిశితంగా గమనిస్తుండాలి. ఒకవైపు కార్పొరేటీరణ, మరోవైపు మనువాదం నేర్పిన సనాతనధర్మం పురుష మెదళ్లలో చెత్తలా పేరుకుపోతోంది. ఈ చెత్తను తొలగించే బాధ్యత ఇంట్లో తల్లిదండ్రులది, పాఠశాలలో ఉపాధ్యాయులది. ఇంట్లో తల్లిని, చెల్లినీ గౌరవించడం నేర్వాలి. బయటి స్త్రీలకు కూడా అంతే గౌరవ మర్యాదలివ్వాలి. పాఠ్యాంశాల్లోనూ అమ్మాయి-అబ్బాయి సమానమన్న భావన పాదుకొల్పాలి. ఆ దిశగా అబ్బాయిలను పెంచాలి. వారి మానసిక వికాసానికి తోడ్పడాలి. వంట చేయడం, ఇల్లు తుడవడం వంటివి కేవలం అమ్మాయిల పని మాత్రమే కాదు, అబ్బాయిలూ నేర్వాలన్న విజ్ఞత తల్లిదండ్రులే నేర్పాలి. 'అన్ని బాధ్యతల్నీ సమానంగా పంచుకునే మనం/ మన బరువు దించేందుకు చేయందించరేమని నిలదీయాలి/ మన పిల్లల నుంచైనా/ ఇంటి పనంటే ఇంతులది కాదని నేర్పాలి/ అమ్మాయిలతో పాటు అబ్బాయికీ అంట్లు తోమడం అలవాటు చేయాలి' అంటారు పాటిబండ్ల రజని. అబ్బాయిల పెంపకంలో ఈ తరహా మార్పు అవసరం.

మహనీయుల మాట



నువ్వు ఆనందదాయకమైన జీవితం గడపాలనుకుంటే దాన్ని వ్యక్తులతోనో లేక వస్తువులతోనో గాక ఒక లక్ష్యంతో ముడిపెట్టుకో.

- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త.



అంబేద్కర్‌కు అవమానం, పార్లమెంటుకు గ్రహణం

ప్రస్తుతం



తెలకపల్లి రవి

దేశంపై తన నిరంకుశాధిపత్యాన్ని రుద్దడానికీ, ప్రత్యక్ష పరోక్ష పద్ధతులలో ప్రత్యర్థులపై, ప్రతిపక్షాలపై దాడి చేయడానికి మోడీ ప్రభుత్వం ఎంత దూరమైనా పోవడానికి సిద్ధంగా వుందని ఈ వారం రోజుల పార్లమెంటు సమావేశాలు హెచ్చరిస్తున్నాయి. ఆఖరుకు ముందుగా అనుకున్న దానికన్నా ముందే అర్థంతరంగా ఏకపక్షంగా వాటిని ముగించి, కీలక చర్చలన్నిటికీ మంగళం పాడటం వ్యూహాత్మకంగా జరిగిందే. అటు రాజ్యాంగానికి ఎసరు పెడుతూ రాజకీయ రభస రగిలించడమే గాక భౌతికంగా ఇటు రాష్ట్రాలలోనూ రాజధానిలోనూ బిజెపి సంఘ పరివార్ ప్రయోగిస్తున్న పాచికలు ఇన్నీ అన్నీ కావు. బడా మీడియా, అనేక కీలక ప్రాంతీయ పార్టీలూ వంత పాడుతున్నాయి గనక సామాన్య ప్రజలకు వీటి తీవ్రత అందకుండా పోతున్నది. ఒకదానికి ఒకటి అడ్డం పెడుతూ అనుకున్న దిశలో బండి నడిపించుకోవడానికి బిజెపి, ఎన్‌డిఎ భాగస్వాములను కూడా మద్దతుదారులుగా మార్చుకుంటున్నది. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పార్లమెంటు వేదికపై అడ్డుకోవడాలు, అఘాయిత్యాలు జరిగినా తెలుగు రాష్ట్రాల్లో కీలక ప్రాంతీయ పార్టీలు నోరు మెదపకపోవడం ఇందుకో ఉదాహరణ మాత్రమే. తెలుగుదేశం, జనసేన నేరుగా ఎన్‌డిఎలో వుండి బలపరుస్తుంటే వైసిపి బయటి నుంచి తోడు నిలుస్తున్నది. బిఆర్‌ఎస్ అటూ ఇటూ కాకుండా కాంగ్రెస్, బిజెపి ఒకటేననే వింత వాదనతో పరోక్షంగా సహకరిస్తున్నది. ప్రాంతీయ ప్రత్యర్థుల మధ్యనే ప్రదక్షిణలు చేస్తున్న తెలుగు మీడియా జాతీయ స్థాయి చర్చలో స్పష్టమైన కోణాలను చూపించకుండా రాష్ట్ర రాజకీయాల స్థాయికి దించేస్తున్నది. అందుకే ఇది తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకించి లోతుగా చర్చించాల్సి వుంది.

అదానీ టు సోరోస్

ఈ సమావేశాలు మొదలవడానికి ముందే అదానీ భాగోతం అమెరికాలో భగ్గుమన్నది. మోడీ నుంచి జగన్ వరకూ విస్తరించిన ఈ వ్యవహారంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కూడా ప్రస్తావనకు వచ్చింది. ఈ అంశం చర్చకు చేపట్టాలని ప్రతిపక్షాలు ఎంతగా పట్టుపట్టినా పోరాడినా మొండిగా నిరాకరించిన బిజెపి కుయుక్తులతో రాజ్యాంగ ఏర్పాటు 75వ వార్షికోత్సవాల ప్రహసనం చేపట్టి ప్రవచనాలు గుప్పించింది. నెహ్రూపై ద్వేష పూరితమైన వ్యాఖ్యలతో విషం కక్కింది. అదానీపై చర్చను పక్కదోవ పట్టించడం కోసం జార్జి సోరోస్ కథనం తీసుకొచ్చి సోనియా గాంధీ కాంగ్రెస్‌లతో పాటు లౌకిక పక్షాలు కూడా ఆయన తరపున పని చేస్తున్నారని దుష్ప్రచారానికి దిగింది. గతంలో సమాంతర మీడియాపై దాడికి కూడా ఇదే వాదన చేయడం గుర్తుండి వుంటుంది. ఏతావాతా సోరోస్‌తో చేతులు కలిపి భారత దేశానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయనేది సంఘ పరివార్ అల్లుతున్న అబద్ధపు పురాణం. అదే నిజమైతే పదేళ్లుగా అప్రతిహత అధికారం చలాయిస్తున్నవారు ఎందుకు శోధించి బయటికి తీయలేకపోయారు? న్యూస్ క్లిక్, వైర్ వంటి వాటికి అండగా వున్న సింగం చైనా ఏజంటంటూ ఇదే ప్రచారం చేశారు గాని చివరకు చెప్పిందేమీ లేదు. ఇప్పుడు తామే చైనాతో సాధారణ సంబంధాలకు చొరవ తీసుకున్నారు. దేశద్రోహులుగా ప్రతిపక్షాలపై ముద్ర వేయడం ఒక పథకం ప్రకారం సాగుతున్న కుట్ర. సిపిఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ రాజ్యసభలో దీనిపై చక్కటి చురక వేశారు. నెహ్రూ వ్యతిరేక ప్రచారం కోసం ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖనే ఏర్పాటు చేస్తే పోతుందని ఆయన అన్నారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి స్వయంగా రాజ్యసభలో ఒకప్పుడు నెహ్రూను రాముడితో పోల్చారని అలాంటి నెహ్రూ ఇప్పుడు రావణుడై పోయాడని వ్యాఖ్యానించారు. కేరళలో నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని రద్దు చేసిన నెహ్రూతో తమకు విభేదాలున్నాయి గాని ఆయనపై ద్వేష ప్రచారానికి తాము వ్యతిరేకమని అన్నారు. ఎమర్జెన్సీని తాము వ్యతిరేకించాము గాని ఇప్పుడు దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తున్నదని హెచ్చరించారు. 56 అంగుళాల ఛాతీ గల ప్రధాని హయాంలో బయటి నుంచి ఎవరో మన దేశాన్ని అస్థిరపర్చే కుట్ర చేస్తున్నారని చెప్పుకోవడం అవమానం కాదా అని బ్రిట్టాస్ వేసిన ప్రశ్న ఎక్కడా కనిపించకపోవడం ఆశ్చర్యమే. సోరోస్‌తో సంబంధాలు దేశ ద్రోహం వంటి అంశాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) వేయాలని కోరారు. ఆ కమిటీ ప్రత్యేక దర్యాప్తు చేపడితే ఆ మూలాలు మోడీ ఇంటి దగ్గరే తేలతాయని బ్రిట్టాస్ వ్యాఖ్యానించారు. ఎందుకంటే మనం ఐక్యరాజ్యసమితి ప్రజాస్వామ్య నిధికి విరాళం ఇస్తున్నాం. దానికీ సోరోస్‌కూ సంబంధం వుంది. మరి మనమే ఆయనకు డబ్బు పంపుతున్నామా అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో అమెరికా పాత్ర గురించి ఎందుకు మాట్లాడటం లేదు? అదానీ గురించి విస్తారంగా వచ్చినదాన్ని దాటేసి కృత్రిమంగా సోరోస్ రచ్చ ఎందుకు తెచ్చినట్టు? ఇటలీ వెబ్‌సైట్ మీడియా పార్ట్ రాఫెల్ హెలికాప్టర్ల గురించి బయటికి తీసిన దాన్ని వదలిపెట్టి సోరోస్ పై ఏదో రాసిందని ఇక్కడ మీడియాలో కథనాలు వదిలింది. తమ పేరును అనవసరంగా తీసుకొస్తున్నారని మీడియా పార్ట్ ఖండన కూడా ప్రకటించింది.



> సోరోస్ అస్త్రం అదానీ కథనం నుంచి కాపాడలేకపోవడం, రాజ్యాంగ చర్చ కూడా రాజకీయంగా దారి తప్పించకపోవడంతో మోడీ సర్కార్ వ్యూహాలకు చుక్కెదురైంది. జమిలి బిల్లును ఆలస్యం చేసి మరీ రాజ్యాంగ చర్చను సాగదీయాలని మొదట భావించి ఆ మేరకు ప్రకటించారు. అయితే ఈ క్రమంలో అంబేద్కర్ వివాదం స్వయంగా అమిత్ షా ద్వారానే తెరపైకి తెచ్చారు. రాజ్యాంగాన్ని రూపొందించడం ద్వారా హక్కులు కల్పించిన అంబేద్కర్ పేరు చెప్పడాన్ని ఫ్యాషన్‌గా చిత్రిస్తూ దానికి బదులు దేవుడి పేరు అన్ని సార్లు తల్చుకుని వుంటేనన్నా పుణ్యం వచ్చేదని చెప్పడమంటే అర్థమేమిటి? ఇందులో వున్నదీ మత రాజకీయమే. అమిత్ షా వక్ర వ్యాఖ్య దేశ వ్యాపిత నిరసనలకు కారణమవడంతో బిజెపి వ్యూహాలు బెడిసికొట్టాయి. దాంతో ఆలోచన మార్చుకుని ఆదరాబాదరగా జమిలి బిల్లునే సభలో ప్రవేశ పెట్టారు. ఆ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశ పెట్టడానికి పాటించాల్సిన నిబంధనలకు తిలోదకాలు వదలి మొండిగా ముందుకు తెచ్చారు. అయితే దాన్ని జెపిసికి పంపించడం ప్రజాసామ్యం కోసమేనన్నట్టు కొత్త నాటకం నడిపించారు.

అంబేద్కర్‌కు పోటీగా దేవుడు


సోరోస్ అస్త్రం అదానీ కథనం నుంచి కాపాడలేకపోవడం, రాజ్యాంగ చర్చ కూడా రాజకీయంగా దారి తప్పించకపోవడంతో మోడీ సర్కార్ వ్యూహాలకు చుక్కెదురైంది. జమిలి బిల్లును ఆలస్యం చేసి మరీ రాజ్యాంగ చర్చను సాగదీయాలని మొదట భావించి ఆ మేరకు ప్రకటించారు. అయితే ఈ క్రమంలో అంబేద్కర్ వివాదం స్వయంగా అమిత్ షా ద్వారానే తెరపైకి తెచ్చారు. రాజ్యాంగాన్ని రూపొందించడం ద్వారా హక్కులు కల్పించిన అంబేద్కర్ పేరు చెప్పడాన్ని ఫ్యాషన్‌గా చిత్రిస్తూ దానికి బదులు దేవుడి పేరు అన్ని సార్లు తల్చుకుని వుంటేనన్నా పుణ్యం వచ్చేదని చెప్పడమంటే అర్థమేమిటి? ఇందులో వున్నదీ మత రాజకీయమే. అమిత్ షా వక్ర వ్యాఖ్య దేశ వ్యాపిత నిరసనలకు కారణమవడంతో బిజెపి వ్యూహాలు బెడిసికొట్టాయి. దాంతో ఆలోచన మార్చుకుని ఆదరాబాదరగా జమిలి బిల్లునే సభలో ప్రవేశ పెట్టారు. ఆ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశ పెట్టడానికి పాటించాల్సిన నిబంధనలకు తిలోదకాలు వదలి మొండిగా ముందుకు తెచ్చారు. అయితే దాన్ని జెపిసికి పంపించడం ప్రజాసామ్యం కోసమేనన్నట్టు కొత్త నాటకం నడిపించారు. అయినా అసలు ఉద్దేశం బయటపడి పోయిందన్న నిస్పృహతోనే నేరుగా ప్రతిపక్ష నేతను అడ్డుకోవడానికి సిద్ధమైనారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సభలోకి వస్తుంటే మకరద్వారం దగ్గర అయిదుగురు బిజెపి సభ్యులు అడ్డు తగలడమేమిటి? ఇలాంటిది గతంలో ఎప్పుడైనా జరిగిందా? తర్వాత బిజెపి సభ్యులు ప్రతాప్ చంద్ర సారంగి, ముఖేష్ రాజ్‌పుత్ గాయపడ్డారంటూ ఆయనపై నాలుగు సెక్షన్ల కింద కేసు పెట్టారు. వారు అడ్డుకోవడం వల్లనే ఘర్షణ జరిగిందని, తనకూ గాయమైందని ఖర్గే ప్రకటించారు. కాంగ్రెస్ సభ్యులు దీనిపై ఎదురు కేసు పెట్టారు. కాని పోలీసులు కేవలం పాలకపక్షం ఫిర్యాదులపైనే దర్యాప్తు చేస్తూ తమ ఫిర్యాదులను పెడచెవిని పెట్టారని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. ఈ ఘర్షణలను సాకుగా చూపించి సభను ముందే వాయిదా వేశారు. అంతేగాక పార్లమెంటు ప్రాంగణంలో నిరసనలు నిషేధిస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఇది ఎప్పటి నుంచో వున్న సంప్రదాయాలను, హక్కులను నిరాకరించడమే. నిరసనల పట్ల మోడీ సర్కారు ఎంత అసహనంగా వుందో దీంతోనే తెలిసిపోతున్నది. ఇక రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసును తిరస్కరించడం ఇంకో పరిణామం. పైగా సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడం తగదని ఆయన సూక్తులు చెబుతూ సభను ముగించారు. ఉభయ సభల్లోనూ నిరసనలు లేకుండా అడ్డుకోవడం, ప్రతిపక్షాలు ఎంత అభ్యర్థించినా న్యాయమైన చర్చలకు అనుమతించకుండా వాటిపైనే విద్రోహం ఆరోపణలు చేయడం బిజెపి ఇరకాటానికి అద్దం పట్టింది. చర్చలు సవ్యంగా జరిగితే ఎదుర్కోలేమన్న భయంతోనే ముందే అడ్డుకోవడం ఇక్కడ వ్యూహం. అంతా అయ్యాక రాజ్యసభ 60 శాతం, లోక్‌సభ 45 శాతం సమయం వృథా అయ్యిందని, పెట్టిన 16 బిల్లులలో ఒక్కదాన్నే ఆమోదించ గలిగిందని మొసలి కన్నీళ్లతో నివేదికలు విడుదల అయ్యాయి. అంబేద్కర్‌ను అవమానించినందుకు క్షమాపణలు చెప్పడం గానీ కనీసం సర్దిచెప్పడం గానీ ఇప్పటికీ జరగలేదంటే మనువాద సిద్ధాంతకర్తల నిజస్వరూపం ఏమిటో తెలుస్తుంది. నిజానికి 1992లో అంబేద్కర్ వర్ధంతి రోజైన డిసెంబర్ 6న బాబ్రీ మసీదు విధ్వంసానికి పాల్పడినప్పుడే వారు లౌకిక తత్వంతో పాటు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపైనా అంబేద్కర్‌పైన తమకే మాత్రం గౌరవం లేదని చేతల్లో చెప్పేశారు.

డబుల్ గేమ్

రాహుల్ గాంధీపై కేసును నేర పరిశోధన విభాగానికి అప్పగించారు గనక ఏ మలుపు తిప్పుతారనేది చెప్పలేం. కాంగ్రెస్ వైపునా ఏమైనా లోపాలుంటే వుండొచ్చుగానీ అసలైన బాధ్యత అధికార పార్టీదే. ఇదే సమయంలో ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ ప్రతి మసీదు కింద మందిరాలున్నాయని వివాదాలు విస్తరించడం సరికాదని నీతి పాఠాలు చెప్పడం కూడా సందేహాలు పెంచింది. ఎందుకంటే అన్ని చోట్లా కాదు, కొన్నిటిపై కేంద్రీకరించాలనే వ్యూహం తీసుకోబోతున్నట్టు కనిపిస్తుంది. అయోధ్య తర్వాత 'కాశీ, మథుర బాకీ హై' అన్న వారి ప్రచారం బాగా తెలిసిందే గనక ఆ దిశలో వ్యూహాలు నడవొచ్చు. సంభాల్‌లో మసీదు సర్వేను సుప్రీం కోర్టు నిలిపేసినా అదే చోట మరేదో మందిరం బయట పడిందంటూ జాతీయ స్థాయిలోనే హడావుడి సాగిస్తున్నారు. అక్కడ సర్వేలు మొదలెట్టారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి శేఖర్ కుమార్ యాదవ్ విహెచ్‌పి సభలో విద్వేష ప్రసంగం చేయడాన్ని సుప్రీం కోర్టు కొలీజియం పిలిచి మందలిస్తే యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సమర్థిస్తున్నారు. మసీదులు, మందిరాలపై మోహన్ భగవత్ మాట్లాడిన దానికి భిన్నంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు వినిపిస్తున్నారు. ఈ ద్వంద్వ క్రీడ మనకు బాగా పరిచితమైన సంఘ పరివార్ పని విభజనలో భాగమే. తమ వాదనలు వ్యూహాలు దాడులపై నిరసన వస్తున్నది గనకే సన్నాయి నొక్కుల పని ఒకరు తీసుకుంటే మరొకరు షరామామూలుగా విద్వేషకాండ సాగిస్తున్నారని అర్థం చేసుకోవాలి. తిరుమల కొండపై అన్య మత ఉద్యోగుల తొలగింపు అంటూ మొదలు పెట్టి ఇప్పుడు శికారి తెగవారిపై ఆ ముద్ర వేసి దుకాణాలు మూయించి వెళ్లగొట్టడం దేనికి నిదర్శనం? సనాతన మతమే భారతీయుల జాతీయ మతమని యోగి ఆదిత్యనాథ్ ఉవాచ. ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే మతం, ఒకే పార్టీ, ఒకే నేత అనే నినాద పరంపరకు పరాకాష్టగానే వీటిని చూడక తప్పదు. ఇంతా చేసి లోక్‌సభలో మెజార్టీ కోల్పోవడం, రాజ్యసభలో అసలే లేకపోవడం బిజెపికి మింగుడు పడని పరిస్థితిగా తయారైంది. తత్ఫలితంగానే పార్లమెంటును రణ క్షేత్రంగా మార్చేందుకు సిద్ధమైపోయారని తాజా సమావేశాలు చేసిన హెచ్చరిక. ★

'మున్సిపల్' సమ్మె ఒప్పందాల అమలులో నిర్లక్ష్యం

సమస్య



కె.ఉమామహేశ్వరరావు

రాష్ట్రంలో గత 7 నెలల క్రితం ఏర్పడిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వంపైన అన్ని రంగాల కార్మికులతోపాటు మున్సిపల్ కార్మికులు కూడా గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు గత వైసిపి ప్రభుత్వ పాలనలో తమకు జరిగిన అన్యాయానికిగాను కసితో తెలుగుదేశం కూటమికి ఓట్లు వేశారు. టిడిపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నారా లోకేష్, ఇతర మంత్రులను పలుమార్లు కలిసి జీతాలు పెంచి తమ కుటుంబాలను ఆదుకోవాలని వేడుకున్నారు. అయినప్పటికీ జీతాల పెంపు విషయంలో ప్రభుత్వం నుండి ఏ విధమైన స్పందన లేకపోవడంతో పోరు బాట పట్టేందుకు సిద్ధపడుతున్నారు.

గత ఒప్పందాలు అటకెక్కినట్టేనా?

వైసిపి ప్రభుత్వ హయాంలో 'సమాన పనికి సమాన జీతం, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పర్మినెంట్' హామీల అమలు కోసం మున్సిపల్ కార్మికులు దీర్ఘకాలిక పోరాటాలు నిర్వహించారు. నిర్బంధాలు, అరెస్టులు, అక్రమ కేసులు ఎదుర్కొని మిలిటెంట్ పోరాటాలు నిర్వహించారు. 2023 డిసెంబర్ 26 నుండి 2024 జనవరి 11వ తేదీ వరకు 17 రోజులు చారిత్రాత్మక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం దిగి వచ్చి 'క్లీన్ ఎన్విరాన్‌మెంట్' వర్కర్లకు (33,500 మందికి) రూ.15 వేల నుండి రూ.21 వేలకు, యుజిడి, చెత్త వాహనాల డ్రైవర్లకు రూ.18,500 నుండి రూ.24,500కు జీతాలు పెంచుతూ జీవో ఎం.ఎస్. నెంబర్ 36 జారీ చేసింది. 12-13 వేల మందిగా ఉన్న ఇంజనీరింగ్ కార్మికులకు జీతాల పెంపు కోసం 9 మంది అధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ సమ్మె సందర్భంగా రాష్ట్ర వ్యాపితంగా నమోదు చేసిన పోలీసు కేసులన్నింటిని ఉపసంహరిస్తూ 2024 మార్చి 15వ తేదీ 357 జీవోను జారీ చెయ్యడమంటే రాష్ట్ర కార్మికోద్యమ చరిత్రలో గర్వించదగిన పోరాటం.

మున్సిపల్ రంగంలోని 48 వేల మందిగా ఉన్న ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులందరికీ వర్తింపచేసే విధంగా నాటి ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు ఊసులో లేకుండా పోయాయి. రిటైర్మెంట్ బెనిఫిట్లు (10 సంవత్సరాల సర్వీసు ఉంటే రూ.75 వేలు ఆ పైన ఏడాదికి రూ.2 వేలు అదనంగా), ప్రమాద బీమా రూ.5 లక్షల నుండి రూ.7 లక్షలకు పెంపు, దహన సంస్కారాలకు రూ.15 వేల నుండి రూ.20 వేలకు పెంపు, ఇంజనీరింగ్ కార్మికుల జీతాల పెంపు, సంక్షేమ పథకాలు, పర్మినెంట్ కార్మికులకు సరండర్ లీవ్‌లు, జి.పి.ఎఫ్ అకౌంట్లు తదితర డిమాండ్ల పరిష్కారానికి 2024 జనవరి 24వ తేదీన నాటి ప్రభుత్వం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు సిఫార్సు చేసింది. కాగా ఆ తరువాత సాధారణ ఎన్నికలు రావడంతో ఈ ఫైళ్ల వ్యవహారం మూలన పడింది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల ఫైళ్లన్నింటిని తిరిగి వెనక్కి పంపించింది. ఇది జరిగి 5 నెలలు గడిచినా పట్టించుకునే నాథుడు లేడు. దీనితో తెలుగుదేశం కూటమి ప్రభుత్వంపై మున్సిపల్ కార్మికులు పెట్టుకున్న ఆశలు అడియాసలుగా మారుతున్నాయనే ఆందోళన ప్రారంభమైంది.

రాష్ట్రంలో ఉద్యోగులతో పాటు కొన్ని శాఖలలో రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్ళకు పెంచారు. కాని మున్సిపల్ కార్మికులకు మాత్రం పెంచలేదు. 60 ఏళ్ళు నిండాయనే సాకుతో బలవంతంగా ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్నవారి, చనిపోయిన వారి స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వడంలేదు. గత ఏడాది కాలంగా చనిపోయిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో చెల్లించడంలేదు. ఇవి కాకుండా పి.ఎఫ్ క్లెయిమ్‌లు రకరకాల సాకులతో దీర్ఘకాలికంగా పెండింగ్ పెడుతున్నాయి. కార్మికులకు పని చేసేందుకు అవసరమైన పనిముట్లు సైతం సక్రమంగా అందించడంలేదు. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా చెవిటివాని ముందు శంఖం ఊదినట్లుగానే ఉంటున్నది.



> **దశల వారీ పోరాటాలకు సిద్ధం**
>
> రిటైర్మెంట్ బెనిఫిట్లు (10 సంవత్సరాల సర్వీసు ఉంటే రూ.75 వేలు ఆ పైన ఏడాదికి రూ.2 వేలు అదనంగా), ప్రమాద బీమా రూ.5 లక్షల నుండి రూ.7 లక్షలకు పెంపు, దహన సంస్కారాలకు రూ.15 వేల నుండి రూ.20 వేలకు పెంపు, ఇంజనీరింగ్ కార్మికుల జీతాల పెంపు, సంక్షేమ పథకాలు, పర్మినెంట్ కార్మికులకు సరండర్ లీవ్‌లు, జి.పి.ఎఫ్ అకౌంట్లు తదితర డిమాండ్ల పరిష్కారానికి 2024 జనవరి 24వ తేదీన నాటి ప్రభుత్వం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు సిఫార్సు చేసింది. కాగా ఆ తరువాత సాధారణ ఎన్నికలు రావడంతో ఈ ఫైళ్ల వ్యవహారం మూలన పడింది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల ఫైళ్లన్నింటిని తిరిగి వెనక్కి పంపించింది. ఇది జరిగి 5 నెలలు గడిచినా పట్టించుకునే నాథుడు లేడు. దీనితో తెలుగుదేశం కూటమి ప్రభుత్వంపై మున్సిపల్ కార్మికులు పెట్టుకున్న ఆశలు అడియాసలుగా మారుతున్నాయనే ఆందోళన ప్రారంభమైంది.

కునారిల్లుతున్న కార్మికుల జీవితాలు

వీధి లైట్లు, వాటర్ సెక్షన్, టౌన్ ప్లానింగ్, గార్డెనింగ్, వెటర్నరీ, మెకానిక్‌లు తదితర విభాగాలలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు పనికి తగిన విధంగా జీతాలు చెల్లించడంలేదు. 2012లో ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎం.ఎస్. నెంబర్ 11 లోని క్యాటగిరీల ప్రకారం మున్సిపల్ కార్మికులకు జీతాలు చెల్లించడంలేదు. 2018 వరకు పారిశుధ్య కార్మికులతో సమానంగా ఇంజనీరింగ్ కార్మికులకు కూడా జీతాలు చెల్లించారు. ప్రస్తుతం అత్యధిక మంది ఇంజనీరింగ్ కార్మికులకు రూ.15 వేలు మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారు. ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్నప్పటికీ రిస్క్ అలవెన్స్ చెల్లించడంలేదు. దూర ప్రాంతాలకు వెళ్లి పని చేసే సందర్భంలో కనీసం టిఎ, డిఎలు కూడా ఇవ్వడంలేదు. ఎమర్జెన్సీ సర్వీసు పేరుతో ఊడిగం చేయిస్తున్నారు తప్ప వీరి కుటుంబాల గురించి పట్టించుకోవడంలేదు.

నేటికీ వెట్టిచాకిరినే...

దశాబ్దాల తరబడి పని చేస్తున్న వందలాది మంది ఎన్.ఎం.ఆర్ కార్మికులకు నేటికీ రూ.13 వేలు మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారు. పట్టణాల విస్తరణ మేరకు కార్మికుల సంఖ్యను పెంచాలని మున్సిపాల్టీల నుండి ప్రతిపాదనలు వచ్చి అనేక సంవత్సరాలు గడుస్తున్నా ఆర్థికశాఖ అనుమతులు ఇవ్వడంలేదు. మున్సిపల్ కౌన్సిల్ తీర్మానాల పేరుతో పని చేయిస్తున్న బదిలీ, కోవిడ్ కార్మికులను మున్సిపల్ కార్మికులుగా గుర్తించకుండా 12 వేల రూపాయలు మాత్రమే జీతాలు ఇస్తున్నారు. పల్నాడు జిల్లా నర్సరావుపేటలో నెలంతా పని చేయించుకొని కేవలం రూ.4-5 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా నందిగామలో ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. తమను వెట్టిచాకిరీ నుండి విముక్తి చెయ్యాలని ఎన్‌ఎంఆర్, బదిలీ, కోవిడ్ కార్మికులు ప్రభుత్వాలను కోరుతున్నారు.

రాష్ట్రంలో పాలకులు మారారు తప్ప విధానాలు మారడంలేదు. శాశ్వత స్వభావం కలిగి విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చెయ్యకుండా ఒప్పంద కార్మికుల పేరుతో పాలకులు దగా చేస్తున్నారు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చాక గత సమ్మె కాలపు ఒప్పందాల అమలు పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాపితంగా దశలవారీ ఆందోళనా పోరాటాలకు ఎ.పి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. గత ఏడాది సమ్మె ప్రారంభమైన డిసెంబర్ 26వ తేదీన రాష్ట్ర వ్యాపితంగా ధర్నాలు, సమ్మె ముగింపు రోజైన జనవరి 11వ తేదీన రిలే నిరాహార దీక్షలు, ఇంజనీరింగ్ కార్మికుల జీతాల పెంపునకు జనవరి 3వ తేదీన ధర్నాలు చేయాలని నిర్ణయించింది. ఈ పిలుపుల్లో మున్సిపల్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చెయ్యాలని కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నది.

(వ్యాసకర్త ఎ.పి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి)

జనవాక్యం

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం?

ఉమ్మడి తెలుగు రాష్ట్రాలే కాక కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో కూడా అగ్రిగోల్డ్ బాధితులకు ఇప్పటికీ పరిహారం అందలేదు. సుమారు పది సంవత్సరాలుగా వారికి న్యాయం జరగడం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి బాధితులకు న్యాయం చేయాలి. లేదా తక్షణమే ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్ లతో కూడిన కమిటీ వేసి తమకు సమగ్ర న్యాయం జరిగే దిశగా అడుగులు వేయాలని బాధితులు కోరుకుంటున్నారు. రాయలసీమ లోని అనంతపురం పరిసర ప్రాంతాల్లో అగ్రిగోల్డ్‌కి సంబంధించి 217 ఎకరాల భూములు వున్నట్లుగా పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. కొందరు ఈ భూములను ఆక్రమించుకుని పది సంవత్సరాలుగా సాగు చేస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వాటిని వేలం వేసి వచ్చిన నిధులను అగ్రిగోల్డ్ బాధితులకు అందించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని భావిస్తున్నాం.

- దాసం వెంకటరెడ్డి, ఊరదాళ్ళపాలెం, పశ్చిమ గోదావరి జిల్లా.



డల్లాస్‌లో 'గేమ్ చేంజర్' ప్రీ రిలీజ్


రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో వస్తోన్న 'గేమ్ చేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్ డిసెంబర్ 21న అమెరికాలోని డల్లాస్ నగరంలో నిర్వహించారు. ఈ సినిమా అమెరికా డిస్ట్రిబ్యూటర్ రాజేష్ కల్లేపల్లి ఈ ఈవెంట్‌ను ప్లాన్ చేశారు. ఈ కార్యక్రమానికి రామ్ చరణ్‌తో పాటు నిర్మాతలు దిల్ రాజు, శిరీష్, దర్శకుడు శంకర్‌తో పాటు రామ్ చరణ్‌తో తర్వాత సినిమాలు చేయబోతున్న దర్శకులు బుచ్చిబాబు, సుకుమార్ కూడా ఈ ఈవెంట్‌కి హాజరయ్యారు. ఈ ఈవెంట్‌ని సుమ హోస్ట్ చేశారు. డల్లాస్‌లో రామ్ చరణ్ అభిమానులు, తెలుగు సినీ అభిమానుల కోలాహలం మధ్య ఈవెంట్ జరిగింది. సంక్రాంతి సందర్భంగా జనవరి 10న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. దిల్ రాజు నిర్మాణంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్లో ఈ సినిమా నిర్మించారు. అల్లు శిరీష్ ఈ సినిమాకి మరో నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు.



సోహైల్‌ఖాన్ ఫస్ట్‌లుక్ విడుదల

నందమూరి కళ్యాణ్‌రామ్ నటుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'ఎన్‌కెఆర్ 21' (వర్కింగ్ టైటిల్). ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సయీ మంజ్రేకర్ నటిస్తున్నారు. విజయశాంతి, శ్రీకాంత్, పృథ్వీరాజ్ కీలక పాత్రలు చేస్తున్నారు. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలు. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటుడు సోహైల్‌ఖాన్ తెలుగు తెరకు పరిచయమవుతున్నారు. సోహైల్ పుట్టినరోజు సందర్భంగా ఎన్‌కెఆర్ చిత్ర యూనిట్ ఆయన చేస్తున్న పాత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. 'సోహైల్ ఖాన్, కళ్యాణ్‌రామ్ పాత్రల మధ్య వచ్చే సన్నివేశాలు హైలెట్‌గా ఉంటాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతోంది. కళ్యాణ్‌రామ్‌పై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ ముప్పా వెంకయ్య చౌదరి, సంగీతం అజనీష్ లోక్‌నాథ్, కెమెరా రామ్‌ప్రసాద్.

రాంగోపాల్‌వర్మకు నోటీసులు



'వ్యూహం' సినిమాకు నిబంధనలకు విరుద్ధంగా గత ప్రభుత్వం నుంచి నిధులు పొందటంపై దర్శకుడు రాంగోపాల్‌వర్మకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం లీగల్ నోటీసులు పంపింది. ఎపి ఫైబర్ నెట్ కార్పొరేషన్ ద్వారా వ్యూహం సినిమాకు వ్యూస్ లేకున్నా రూ.1.15 కోట్లు లబ్ధి పొందారని పేర్కొంది. ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి ఆదేశాల మేరకు అప్పటి ఎండితోపాటు మరో ఐదుగురికి నోటీసులు పంపారు. నిబంధనలకు విరుద్ధంగా లబ్ధి పొందినందుకు 15 రోజుల్లోపు వడ్డీతో సహా ఆ మొత్తాన్ని కట్టాలని నోటీసు ద్వారా ఆదేశించారు.



రెగ్యులర్ షూటింగ్‌లో 'శంబాల'

ఆది సాయికుమార్, అర్చన అయ్యర్ కలిసి నటిస్తున్న చిత్రం 'శంబాల'. హారర్ థ్రిల్లర్‌గా డిఫరెంట్ కాన్సెప్ట్‌తో దర్శకుడు యుగంధర్ ముని తెరకెక్కిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఫిల్మ్‌సిటీలో ఇటీవల ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. రెగ్యులర్‌గా షూటింగ్ కొనసాగుతోంది. ఈ చిత్రంలో ఆది సాయికుమార్ జియో సైంటిస్ట్‌గా కనిపించనున్నారు. రాజశేఖర్ అన్నభీమోజు, మహిధర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. రాజశేఖర్ అన్నభీమోజు, మహిధర్ రెడ్డి భారీ ఎత్తున నిర్మించనున్నారు. శ్వాసిక కీలక పాత్ర పోషిస్తున్నారు. కీలకపాత్రల్లో రవివర్మ, మీసాల లక్ష్మణ్, మధునందన్ కనిపించనున్నారు. శ్రీరామ్ మద్దూరి సంగీతాన్ని అందించనున్నారు.



దర్శకుడు శంకర్ దయాళ్ మృతి

తమిళ దర్శకుడు శంకర్ దయాళ్ (48) గుండెపోటుతో మృతిచెందారు. నటుడు కార్తీ కథానాయకుడిగా నటించిన 'శకుని' చిత్రం ద్వారా ఆయన నటుడిగా పరిచయమయ్యారు. 2012లో విడుదలైన ఈ చిత్రం కమర్షియల్‌గా ఆశించిన విజయాన్ని సాధించకపోయినా విశ్లేషకుల నుంచి ప్రశంసలు అందుకుంది. చాలాకాలం తర్వాత ఆయన 'కుళందైగళ్ మున్నేట్ర కళగం' పేరుతో చిత్రం చేశారు. హాస్యనటుడు సెంథిల్, యోగిబాబు ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం షూటింగ్ కార్యక్రమాలను పూర్తిచేసుకుంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది వేసవిలో విడుదల చేయటానికి మేకర్లు సన్నాహాలు చేస్తున్నారు. చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొనడానికి కారులో బయలుదేరిన శంకర్‌దయాళ్ గుండెపోటుకు గురయ్యారు. వెంటనే ఆయన్ను చిత్ర యూనిట్‌కు చెందిన వారు కొళత్తూర్ ప్రాంతంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన డాక్టర్ అప్పటికే మృతి చెందినట్లుగా వెల్లడించారు. శంకర్‌దయాళ్ మృతికి కోలీవుడ్ పరిశ్రమకు చెందిన ప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం.VI (ఎ)

Ref No: B1/67/2019 ది.20-12-2024

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్(1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూలులో చూపబడిన **అనకాపల్లి జిల్లా, కశింకోట మండలం, గైతులపాలెం గ్రామం** నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ఎడమ కాలువకు కి.మీ. 161.200 నుండి కి.మీ. 161.500 వరకు గట్టు ఏర్పాటు చేయుట మరియు కి.మీ. 161.290 వద్ద మరియు కి.మీ. 161.544 వద్ద భూగర్భ కాలువ మరియు కి.మీ. 161.200 నుండి 161.500 & యస్.ఇ @ కి.మీ. 161.480 ఏర్పాటు చేయు నిమిత్తము భూమి అవసరమైనట్లు ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు భావించినందున భూసేకరణ, నష్టపరిహారం, పునరావాస, పునరుపాధి కల్పన చట్టం - 2013 నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనల ననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికీ తెలియజేయడం కొరకు ఇందుమూలముగా నోటీసు జారీ చేయబడినది.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, స్పెషల్ డిప్యూటీ కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ, యూనిట్-1, రాజమహేంద్రవరం వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/ కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచూరించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా కలెక్టరు/ ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్ధనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా: అనకాపల్లి **మండలం: కశింకోట** **గ్రామం: గైతులపాలెం**

క్రమ సంఖ్య	సర్వే నెం. స.డి.నెం.	వర్గీకరణ	మొత్తం విస్తీర్ణం య.సెంట్లు	భూసేకరణ క్రిందవిస్తీర్ణంయ. సెంట్లు	సంబంధితఆసామి పేరు మరియుచిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు/ కట్టడములు వగైరావివరాలు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1	27-A1A2	ఇ.పుంజ	0.07	0.07	మారిశెట్టి చిన అచ్చినాయుడు (తండ్రి) పెద అప్పలనాయుడు	స.నెం. 41	స.నెం.27-9A, 27-10A2	స.నెం. 27-1B	స.నెం. 27-1A1	
2	27-A1C1	ఇ.పుంజ	0.48	0.48	మారిశెట్టి అప్పలనరసమ్మ (భర్త) అచియ్య నాయుడు	స.నెం. 41	స.నెం. 27-25A, 27-24C, 27-26, 27-32	స.నెం. 27-1C2	స.నెం. 27-1B	
3	27-A7C2	ఇ.పుంజ	0.02	0.02	మారిశెట్టి నాగరాజు (తండ్రి)సన్యాసి	స.నెం. 27-10B1	స.నెం. 27-14A2	స.నెం. 27-1B	స.నెం. 27-7C1	
4	27-A9A	ఇ.పుంజ	0.05	0.05	మారిశెట్టి నాగరాజు (తండ్రి)సన్యాసి	స.నెం. 27-1A2	స.నెం. 27-9B	స.నెం. 27-10A2	స.నెం. 27-8A	
5	27-A10A2	ఇ.పుంజ	0.12	0.12	మారిశెట్టి నాగరాజు (తండ్రి)సన్యాసి	స.నెం. 27-1A2	స.నెం.27-10A1, 27-10B1	స.నెం. 27-1B	స.నెం. 27-9A, 27-10A	
6	27-A10B1	ఇ.పుంజ	0.02	0.02	మారిశెట్టి అప్పారావు (తండ్రి)నూకాలు మారిశెట్టి అప్పలనరసమ్మ (భర్త) అచియ్య నాయుడు	స.నెం. 27-10A2	స.నెం. 27-7C2	స.నెం. 27-1B	స.నెం. 27-7C2	
7	27-A14A2	ఇ.పుంజ	0.15	0.15	మారిశెట్టి పెద అప్పారావు (తండ్రి)నూకాలు	స.నెం. 27-7C2	స.నెం. 27-16A2	స.నెం. 27-1B	స.నెం. 27-14A1	
8	27-A16A2	ఇ.పుంజ	0.06	0.06	మారిశెట్టి నాగరాజు (తండ్రి) సన్యాసి	స.నెం. 27-14A2	స.నెం. 27-17A	స.నెం. 27-1B	స.నెం. 27-16A1	
9	27-A17A	ఇ.పుంజ	0.01	0.01	మారిశెట్టి చిన్న అచ్చియ్యనాయుడు	స.నెం. 27-16A1, 27-16A2	స.నెం. 27-19A2	స.నెం. 27-1B	స.నెం. 27-18	
10	27-A19A2	ఇ.పుంజ	0.10	0.10	మారిశెట్టి నాగరాజు (తండ్రి) సన్యాసి	స.నెం. 27-17A	స.నెం. 27-20A1	స.నెం. 27-1B	స.నెం. 27-19A1	
11	27-A20A1	ఇ.పుంజ	0.06	0.06	ఇందల రాము (తండ్రి)బంగారయ్య	స.నెం. 27-19A2	స.నెం. 27-40	స.నెం. 27-1B	స.నెం. 27-40	
12	27-A24C2	ఇ.పుంజ	0.09	0.09	మారిశెట్టి చిన అచ్చింనాయుడు (తండ్రి)పెద అప్పలనాయుడు	స.నెం. 27-1C1	స.నెం. 27-24D2A	స.నెం. 27-25A	స.నెం. 27-1B	
13	27-A24D2A	ఇ.పుంజ	0.08	0.08	మారిశెట్టిఅప్పారావు (తండ్రి)నూకాలు	స.నెం. 27-24C	స.నెం. 27-24D2B	స.నెం. 27-25A	స.నెం. 27-1B	
14	27-A24E2A	ఇ.పుంజ	0.07	0.07	మారిశెట్టి చిన అచ్చింనాయుడు (తండ్రి)పెద అప్పలనాయుడు	స.నెం. 27-24D2B	స.నెం. 27-24F2A	స.నెం. 27-24E2B	స.నెం. 27-1B	
15	27-A24F2A	ఇ.పుంజ	0.04	0.04	మారిశెట్టిఅప్పలనాయుడు (తండ్రి)నూకాలు	స.నెం. 27-24E2A	స.నెం. 27-24G1	స.నెం. 27-24F2B	స.నెం. 27-1B	
16	27-A24G1	ఇ.పుంజ	0.05	0.05	మారిశెట్టి చిన అచ్చింనాయుడు (తండ్రి)పెద అప్పలనాయుడు	స.నెం. 27-24F2B	స.నెం. 32	స.నెం. 27-24G2	స.నెం. 27-1B	
17	27-A25A	ఇ.పుంజ	0.30	0.30	మారిశెట్టిరాజారావు (తండ్రి)చిన్నోడు	స.నెం. 27-1C1	స.నెం. 27-25B	స.నెం. 27-26	స.నెం. 27-24C2, 27-24D2A	
18	27-A26	ఇ.పుంజ	0.31	0.31	కరణం నాగులు (తండ్రి)చిన అప్పల స్వామి	స.నెం. 27-1C1	స.నెం. 27-28A	స.నెం. 27-32	స.నెం. 27-26	
19	27-A32	ఇ.పుంజ	0.28	0.28	మారిశెట్టి చిన అచ్చింనాయుడు (తండ్రి)పెద అప్పలనాయుడు	స.నెం. 27-1C1	స.నెం. 27-30	స.నెం. 27-33	స.నెం. 27-26	
20	32-2B1	స.పుంజ	0.05	0.05	బొల్లి చినతల్లి (తండ్రి) బుచ్చయ్య	స.నెం. 27	స.నెం. 32-3B1	స.నెం. 32-2B2	స.నెం. 32-1	
21	32-3B1	స.పుంజ	0.07	0.07	ఇందల రాము (తండ్రి)బంగారి	స.నెం. 32-2B1	స.నెం. 32-31B1	స.నెం. 32-3B2	స.నెం. 32-1	
22	32-31B1	స.పుంజ	0.10	0.10	ఇందల రాజరావు (తండ్రి) బంగారి	స.నెం. 32-3B1	స.నెం. 32-7B	స.నెం. 32-31B2	స.నెం. 32-1, 32-35B	
23	32-35B	స.పుంజ	0.03	0.03	ఇందల అప్పలనాయుడు (తండ్రి)సత్యం	స.నెం. 32-31B1	స.నెం. 32-7B	స.నెం. 32-13B1	స.నెం. 32-1	
24	32-7B	స.పుంజ	0.10	0.10	రాయి కొండయ్య (తండ్రి)చిన్నోడు	స.నెం. 32-35B, 32-31B1	స.నెం. 32-38B1	స.నెం. 32-34	స.నెం. 32-1	
25	32-38B1	స.పుంజ	0.07	0.07	ఇందుల సత్యనారాయణ (తండ్రి)రాజులు	స.నెం. 32-7B	స.నెం. 32-40B2	స.నెం. 40-C	స.నెం. 32-1	
26	32-40B2	స.పుంజ	0.11	0.11	54.ఇందల రాజయ్య	స.నెం. 32-38B1	స.నెం. 42-41B1	స.నెం. 32-40C	స.నెం. 32-1	
27	32-40C1	స.పుంజ	0.01	0.01	పప్పల గోవిందారావు (తండ్రి)నల్లబాబు	స.నెం. 32-38B1	స.నెం. 32-40C2	స.నెం. 32-40C2	స.నెం. 32-40B2	
28	32-41B1	స.పుంజ	0.08	0.08	బొల్లి చినతల్లి (భర్త)బుచ్చయ్య	స.నెం. 32-40B2	స.నెం. 32-42B1	స.నెం. 32-41B2	స.నెం. 32-1	
29	32-42B1	స.పుంజ	0.06	0.06	ఇందల రాము (తండ్రి)బంగారి	స.నెం. 32-41B1	స.నెం. 32-43B1	స.నెం. 32-42B1	స.నెం. 32-1	
30	32-43B1	స.పుంజ	0.07	0.07	36.గంట (తండ్రి)సీతయ్య	స.నెం. 32-42B1	స.నెం. 32-44A, స.నెం. 40	స.నెం. 32-43B2	స.నెం. 32-1	
31	32-44A	స.పుంజ	0.01	0.01	ఇందలి సత్యవతి (భర్త)లేటు అచ్చన్న	స.నెం. 32-43B1	RS.No. 40	స.నెం. 32-44B	స.నెం. 40	
32	34-2B1	స.పుంజ	0.11	0.11	గొర్లి భూలోకం (తండ్రి)తాతాలు గొర్లి మరిడయ్య (తండ్రి)తాతాలు గొర్లి రాజారావు (తండ్రి)తాతలు	స.నెం. 34-1A	స.నెం. 34-3A	స.నెం. 34-2B2	స.నెం. 35	
33	34-3A	స.పుంజ	0.04	0.04	పచ్చికొర నూకలు (తండ్రి)నల్లబాబు	స.నెం. 34-2B1	స.నెం. 35	స.నెం. 34-3B	స.నెం. 35	
34	39-6B	స.పుంజ	0.04	0.04	మారిశెట్టి నాగరాజు (తండ్రి) సన్యాసి	స.నెం. 39-5	స.నెం. 39-9A1A	స.నెం. 39-7B	స.నెం. 39-6A, 39-7A	
35	39-7B	స.పుంజ	0.15	0.15	మారిశెట్టి అచియ్యనాయుడు (తండ్రి)పెద అప్పలనాయుడు	స.నెం. 39-5	స.నెం. 39-8A	స.నెం. 40	స.నెం. 39-6A, 39-7A	
36	39-8A	స.పుంజ	0.19	0.19	మారిశెట్టి నాగరాజు (తండ్రి) సన్యాసి	స.నెం. 39-7B	RS.No. 39-9A1A	స.నెం. 40	స.నెం. 39-6B	
37	39-9A1B	స.పుంజ	0.02	0.02	ఇందల నరసింహారావు (తండ్రి)సోములు	స.నెం. 39-8A	స.నెం. 39-9B1B	స.నెం. 39-8B	స.నెం. 39-9A1A	
38	39-9B1B	స.పుంజ	0.02	0.02	ఇందల రమణ (తండ్రి)నూకాలు	స.నెం. 39-9A1B	స.నెం. 39-10A2	స.నెం. 39-8B	స.నెం. 39-9B1A	
39	39-10A2	స.పుంజ	0.09	0.09	మంగ రాము (తండ్రి)ఎరుకోడు	స.నెం. 39-9B1B	స.నెం. 39-11A2	స.నెం. 39-8B	స.నెం. 39-10A1	
40	39-11A2	స.పుంజ	0.05	0.05	ఇందల తాతలు (తండ్రి)ముసలి	స.నెం. 39-10A2	స.నెం. 39-12A2	స.నెం. 39-8B	స.నెం. 39-11A1	
41	39-12A2	స.పుంజ	0.05	0.05	గొలిశెట్టి నూకలమ్మ (భర్త)వెంకట రెడ్డి	స.నెం. 39-11A2	స.నెం. 37	స.నెం. 39-8B	స.నెం. 39-12A1	
42	42-6B2	స.పుంజ	0.04	0.04	కుప్పిన తాతలు (తండ్రి)బుల్లోడు	తాళ్ల పాలెం	స.నెం. 42-6C2	తాళ్ల పాలెం	స.నెం. 42-1	
43	42-6C2	స.పుంజ	0.23	0.23	కుప్పిన సూర్యనారాయణ (తండ్రి)నరసయ్య	స.నెం. 42-6B2	స.నెం. 42-12A	తాళ్ల పాలెం	స.నెం. 42-1	
44	42-16B	స.పుంజ	0.05	0.05	కుప్పిన రమణ (తండ్రి)చిన కొండడు	స.నెం. 42-12A	స.నెం. 42-18B	స.నెం. 42-17	స.నెం. 42-13	
45	42-17A	స.పుంజ	0.19	0.19	కుప్పిన లక్ష్మి (భర్త)సత్యారావు	స.నెం. 42-12A	స.నెం. 42-18B1	స.నెం. 42-17B	స.నెం. 42-16B	
46	42-18B1	స.పుంజ	0.12	0.12	బండారు తిరుపతమ్మ	స.నెం. 42-17A	స.నెం. 41	స.నెం. 42-18B2	స.నెం. 42-16B	
47	44-3C2	స.పుంజ	0.01	0.01	చిన్ని భాస్కరరావు (తండ్రి)అచ్చన్న	స.నెం. 44-4B1	స.నెం. 44-3D2A	స.నెం. 44-4B1	స.నెం. 44-1A	
48	44-3D2A	స.పుంజ	0.08	0.08	దంట్ల అప్పారావు (తండ్రి)నూకాలు దంట్ల రాజు (తండ్రి)నూకాలు	స.నెం. 44-4B1	తాళ్ల పాలెం	స.నెం. 44-4B2	స.నెం. 44-1A	
49	44-4B1	స.పుంజ	0.11	0.11	కర్రి సూర్యనారాయణ	స.నెం. 44-7A1	స.నెం. 44-4B2	స.నెం. 44-7A2	స.నెం. 44-1A	
50	44-5B1	స.పుంజ	0.08	0.08	కర్రి సత్యనారాయణ	తాళ్ల పాలెం	స.నెం. 44-7A1	స.నెం. 44-5B2	స.నెం. 44-1A	
51	44-7A1	స.పుంజ	0.04	0.04	కర్రి రమణమ్మ (భర్త)అప్పారావు	స.నెం. 44-5B1	స.నెం. 44-7A2	స.నెం. 44-7A2	స.నెం. 44-1A	
52	44-6A	స.పుంజ	0.01	0.01	కర్రి వెంకట సత్యనారాయణ (తండ్రి)సూర్యనారాయణ	తాళ్ల పాలెం	స.నెం. 44-5B2	స.నెం. 44-6B	స.నెం. 44-5B1	
		మొత్తం:	4.84	4.84						

సం/- **శ్రీమతి ఎస్.సరళ వందనం,** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరుగురు దక్షిణ మధ్య రైల్వే అధికారులకు
అతి విశిష్ట రైల్ సేవా పురస్కారాలు

విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించినందుకు ఆరుగురు దక్షిణ మధ్య రైల్వే అధికారులకు రైల్వే శాఖ అతి విశిష్ట రైల్ సేవా పురస్కారాలు ప్రదానం చేసింది. శనివారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో 69వ అతి విశిష్ట రైల్ సేవా పురస్కారాల ప్రదాన కార్యక్రమం జరిగింది. రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ముఖ్య అతిథిగా హాజరై అధికారులకు పురస్కారాలు అందజేశారు. దేశ వ్యాప్తంగా 101 మంది అధికారులు పురస్కారాలు అందుకున్నారు. దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ఆంథోనీ దొర్రై రాజ్ (చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్), జవ్వాది వెంకట అనూష (సీనియర్ డివిజనల్ ఇంజనీర్), వావిలపల్లి రాంబాబు (సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్), సుమిత్ శర్మ (డిప్యూటీ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్), పి ఆదినారాయణ (సీనియర్ సెక్షన్ ఇంజనీర్), కామర్తు ఏగిరి (సీనియర్ సెక్షన్ ఇంజనీర్) మంత్రి చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతలను మంత్రి అభినందించారు. సివిల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్ విభాగాల్లో దక్షిణ మధ్య రైల్వే జోన్ సాధించిన ప్రగతికి గాను జనరల్ మేనేజర్‌కు మంత్రి షీల్డ్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో అన్ని విభాగాల్లో వినియోగించుకుని వాటిని రైల్వే శాఖ అధికారులకు సూచించారు. ప్రధాన విభాగాల్లో రిసెర్చ్‌ను ప్రోత్సాహించివ్వాలని అన్నారు. పనితీరులో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన వారిని ప్రోత్సహించాలన్నారు. నిర్మాణ విభాగం వారి పాలైన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్, సభ్యులు, బోర్డు సెక్రెటరీ, జోనల్ మేనేజర్లు, హెచ్ఓడీలు పాల్గొన్నారు.



రాబిన్ ఊతప్పకు అరెస్టు వారెంట్ జారీ



బెంగుళూరు: మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్పకు అరెస్టు వారెంట్ జారీ అయింది. ఒక దుస్తుల కంపెనీలో ఉద్యోగులకు చెల్లించే పిఎఫ్ నగదు అవకతవకలకు పాల్పడటమే ఇందుకు ప్రధాన కారణం. బెంగుళూరుకు చెందిన సెంటారస్ లైఫ్ స్టయిల్ బ్రాండ్స్ కంపెనీలో రాబిన్ ఊతప్ప డైరెక్టర్‌గా ఉన్నారు. ఆ కంపెనీ ఉద్యోగుల జీతాల్లో కోత విధించి, వారికి పిఎఫ్ డబ్బులు చెల్లించలేదని ప్రాంతీయ పిఎఫ్ కమిషనర్ సదాక్షరి గోపాల్ రెడ్డి తెలిపారు. ఉద్యోగుల పిఎఫ్‌కు సంబంధించి రూ.24 లక్షల బకాయిలు చెల్లించాల్సి ఉందని, డిసెంబర్ 4న వారెంట్ జారీ చేశామని, ఈనెల 27లోపు అతను పిఎఫ్ నగదును జమ చేసేందుకు అవకాశం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అలాగే ఉద్యోగులకు చెందిన పిఎఫ్ నగదును విత్‌డ్రా చేసినట్లు ఊతప్పపై ఆరోపణలు ఉన్నాయి. అయితే అతను ఉద్యోగుల అకౌంట్లలోకి నిధులను డిపాజిట్ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్మికుల పీఎఫ్ అకౌంట్లను సెటిల్ చేయని ఊతప్పను అరెస్టు చేయాలని లేఖలో కోరారు.

రోహిత్, కోహ్లి ప్రాక్టీస్ షురూ
26నుంచి బాక్సింగ్ డే టెస్ట్



మెల్‌బోర్న్: ఈనెల 26నుంచి ఆస్ట్రేలియాతో జరిగే బాక్సింగ్ డే టెస్ట్‌కు టీమిండియా స్టార్ ఆటగాళ్లు సిద్ధమౌతున్నారు. ఫామ్ లేమితో బాధపడుతున్న కెప్టెన్ రోహిత్ శర్మతోపాటు, విరాట్ కోహ్లీ నాల్గో టెస్ట్ ప్రారంభానికి ముందు ప్రాక్టీస్‌లో చెమటోడ్చుతున్నారు. వీరితోపాటు జైస్వాల్, కెఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్ కూడా కఠోర సాధనలో నిమగ్నమయ్యారు. వీరికి సిరాజ్, ఆకాశ్ దీప్ బౌలింగ్ చేయగా.. స్పిన్, త్రో డౌన్ బంతులను ఎక్కువగా ఎదుర్కొన్నారు. వాషింగ్టన్ సుందర్ వేసిన బంతులను ఎక్కువ రోహిత్ ప్రాక్టీస్ చేయగా.. పేసర్లు సిరాజ్, ఆకాశ్ బంతులను కోహ్లీ సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ మధ్యలోనే టీమిండియా స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పి స్వదేశానికి తిరిగి రావడంతో దేవదత్ పడిక్కల్ అదనపు స్పిన్నర్ కోటాలో చోటు దక్కే ఛాన్స్ ఉంది. స్పిన్నర్ కోటాలో సుందర్, జడేజాతోపాటు బ్యాటర్ కోటాలో సర్ఫరాజ్ ఖాన్, పడిక్కల్ కూడా టీమిండియాకు అందుబాటులో ఉన్నారు. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్ టెస్ట్ సిరీస్‌లో రాణించగా.. వీరికి బౌలింగ్‌లో కోచ్ మోర్నీ మోర్కెల్ పరీక్షించాడు. శనివారం భారత ఆటగాళ్లు నెట్స్‌లో సుమారు మూడు గంటలకు పైగా గడిపారు. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఇప్పటివరకు ముగిసిన మూడు టెస్ట్‌ల్లో ఇరుజట్లు 1-1తో సమంగా ఉన్న సంగతి తెలిసిందే.

పాకిస్తాన్‌కు ఐసిసి బృందం

లాహోర్: 2025లో పాకిస్తాన్ వేదికగా జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ లైన్ క్లియర్ కాగా.. భద్రతా ఏర్పాట్లపై సమీక్షించేందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) పాకిస్తాన్‌కు తమ బృందాన్ని శనివారం పంపింది. అలాగే ఈ సిరీస్‌కు ముందు జరిగే ముక్కోణపు సిరీస్ భద్రత, ఇతర ఏర్పాట్లను సమీక్షించేందుకు న్యూజిలాండ్ క్రికెట్ బృందం సైతం పాక్‌కు ఓ స్పెషల్ టీమ్‌ని పంపింది. పాకిస్తాన్‌తో పాటు న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా జట్లు ముక్కోణపు సిరీస్ జరగనుంది. భద్రతా నిపుణులు రెగ్ డికాసన్, న్యూజిలాండ్ ప్లేయర్స్ అసోసియేషన్ ప్రతినిధి బ్రాడ్ రోడెన్ న్యూజిలాండ్ జట్టులో ఉన్నారు. వారం రోజులు కరాచీ, లాహోర్‌లో భద్రతా ఏర్పాట్లతో పాటు ఇతర సన్నాహకాలను సమీక్షించనున్నారు. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఆడే మ్యాచులన్నీ తటస్థ వేదికల్లో జరుగుతాయని ఐసిసి ఇప్పటికే స్పష్టం చేసింది. ఛాంపియన్స్ ట్రోఫీ నేపథ్యంలో స్టేడియాలను సిద్ధం చేసేందుకు పాకిస్తాన్ క్రికెట్‌బోర్డు రూ.100కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నట్లు సమాచారం.

జమ్ముకాశ్మీర్‌లో 'శీతాకాలం' ప్రారంభం

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో తీవ్రమైన శీతాకాలంగా పేర్కొనే చిల్లై కాలన్ శనివారం నుంచి ప్రారంభమైంది. శ్రీనగర్‌లో రికార్డు స్థాయిలో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 8.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. గత 50 ఏళ్లలో డిసెంబరు నెలకు ఇదే కనిష్ట ఉష్ణోగ్రత అని భారత వాతావరణ శాఖ తెలిపింది. కాశ్మీర్ లోయలో ఇతర ప్రాంతాల్లోనూ ఉష్ణోగ్రతలు క్షీణించాయని వెల్లడించింది. శ్రీనగర్‌లో గురువారం రాత్రి కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 6.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని, శుక్రవారానికి ఇది మైనస్ 8.5కు పడిపోయిందని వాతావరణ శాఖ తెలిపింది. శ్రీనగర్‌లో 1974 డిసెంబరులో నమోదైన 10.3 డిగ్రీల సెల్సియస్ తరువాత ఇదే కనిష్ణ ఉష్ణోగ్రత అని, 1891 నుంచి ఇది మూడో కనిష్ట ఉష్ణోగ్రత అని వాతావరణ శాఖ తెలిపింది. పహల్గాం, గుల్మార్గ్, కొనిబాల్, పాంపోర్, ఖాజిగుండ్, కుప్వారా వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు క్షీణించాయి. తక్కువ ఉష్ణోగ్రతతో దాల్ సరస్సులో చాలా భాగం గడ్డకట్టింది. లోయలోని అనేక ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుంది. చిల్లై కాలన్ అనేది దాదాపు 40 రోజుల పాటు ఉంటుంది. ఈసారి ఈ కాలం 2025 జనవరి 31 వరకూ ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

జైపూర్ ఘటనలో 14కు పెరిగిన మృతుల సంఖ్య

జైపూర్ : రాజస్థాన్‌లో ఒక ట్రక్కు సృష్టించిన అగ్నిప్రమాద ఘటనలో మృతుల సంఖ్య 14కు పెరిగింది. పశ్చిమ జైపూర్ డీసీపీ అమిత్ కుమార్ ఈ విషయాన్ని వెల్లడించారు. రసాయనాలతో నిండి ఉన్న ఓ ట్రక్కు శుక్రవారం సీఎన్‌టీ ట్యాంకర్, ఇతర వాహనాలను ఢీ కొనడంతో భారీ విస్ఫోటనం జరిగి, మంటలు చెలరేగటం, అది కాస్తా అక్కడి పెట్రోల్ పంపునకు అంటుకోవటంతో పెద్ద ఎత్తున అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఘటన అనంతరం క్షతగాత్రులను ఎస్ఎంఎస్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రాజ్యాంగం సాక్షిగా వివాహం ఛత్తీస్‌గఢ్‌లో ఒక్కటైన జంట

రాయ్‌పూర్ : భారత రాజ్యాంగానికి ఛత్తీస్‌గఢ్‌లోని ఓ మారుమూల గ్రామంలో ఉన్న షెడ్యూల్డ్ కులాల జంట అపూర్వమైన గౌరవాన్ని ఇచ్చింది. ప్రతిమ, యమన్ లహ్రే అనే జంట రాజ్యాంగ పీఠికపై ప్రమాణం చేసి ఒక్కటయ్యారు. సంప్రదాయబద్ధంగా జరిగే వివాహ తంతుపై కంటే వారిద్దరూ రాజ్యాంగం పైనే నమ్మకం ఉంచడం విశేషం. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటం సాక్షిగా వారిద్దరూ పూల మాలలు మార్చుకొని వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టారు.

ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌కు 350 కిలోమీటర్ల దూరంలోని జష్‌పూర్ జిల్లా కాపు గ్రామంలో ఈ వివాహ వేడుక నిరాడంబరంగా జరిగింది. యువ దంపతులిద్దరూ షెడ్యూల్డ్ కులమైన సత్నామీ తెగకు చెందిన వారు. తమ తెగ వ్యవస్థాపకుడు గురు ఘాసీదాస్ జయంతిని పురస్కరించుకొని వారిద్దరూ వివాహం చేసుకున్నారు. కనీసం భాజాభజంత్రీలు కూడా లేవు...రాజ్యాంగ పీఠికను చేతిలో ఉంచుకొని ప్రమాణం చేస్తూ వివాహ బంధాన్ని ప్రారంభించారు.'రాజ్యాంగం సాక్షిగా ఒక్కటవ్వాలని నిర్ణయించుకున్నాము. కేవలం మా కుటుంబాలు, ఆమోదించారు.

గత ఏడాది మే9న జరిగిన అల్లర్లలో 25మంది పౌరులకు జైలు శిక్ష

- పాక్ మిలిటరీ కోర్టుల తీర్పు

ఇస్లామాబాద్ : గతేడాది మే 9న అంటే మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అరెస్టు అనంతరం చెలరేగిన అల్లర్లకు సంబంధించిన కేసుల్లో 25మంది పౌరులకు పాకిస్తాన్ మిలటరీ కోర్టులు శిక్షలు విధించాయి. అల్లర్ల సందర్భంగా మిలటరీ స్థావరాలపై దాడులకు పాల్పడినందుకు వీరికి రెండు నుండి పదేళ్ల పాటు జైలు శిక్ష విధించినట్లు ఆర్మీ శనివారం ప్రకటించింది. 2023 మే 9న తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పిటిఐ) మద్దతుదారులు రావల్పిండిలోని ఆర్మీ హెడ్ క్వార్టర్స్, ఫైసలాబాద్‌లోని ఐఎస్ఐ భవనంతో సహా పలు మిలటరీ స్థావరాలపై దాడులు జరిపారు. అవినీతి కేసులో తమ నేతను అరెస్టు చేసినందుకు వారు ఆగ్రహంతో ఈ దాడులకు దిగారు.

దేశంలో పలు ప్రాంతాల్లో రాజకీయ ప్రేరేపిత హింసాకాండ చెలరేగిందని, ఇది పాకిస్తాన్ చరిత్రలో ఓ చీకటి అధ్యాయమని మిలటరీ ఒక ప్రకటనలో పేర్కొంది. మొదటి దశలో 25మందికి శిక్షలు విధించామని, మిగిలిన వారిపై ఇంకా విచారణ జరుగుతోందని, అవి కూడా త్వరలో ప్రకటిస్తామని ఆ ప్రకటన తెలిపింది. వీరిలో 14మందికి పదేళ్ళ పాటు శిక్ష విధించారు.

ఇజ్రాయిల్‌పై యెమెన్ క్షిపణి దాడులు

- గాజాలో దాడుల్లో 77 మంది మృతి

గాజా, కైరో : ఇజ్రాయిల్ తీర ప్రాంతమైన టెల్ అవీవ్ సమీపంలో యెమెన్ క్షిపణులతో పెద్దయెత్తున దాడి చేసింది. గడచిన 24 గంటల్లో జరిగిన దాడుల్లో 77 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు ఇజ్రాయిల్ ను లక్ష్యంగా చేసుకుని డ్రోన్లతో దాడి చేశాయి. యెమెన్‌లోని హౌతీ-ఆధీనంలో గల ప్రాంతాల్లో, ఓడరేవులు, ఇంధన మౌలిక సదుపాయాలపై ఇజ్రాయిల్ దాడులకు ప్రతీకారంగా వారు ఈ దాడులు జరిపారు.

బీమాపై జిఎస్‌టి తగ్గింపు వాయిదా

- సెకండ్‌హ్యాండ్ కార్లపై 18 శాతం పన్ను
- జిఎస్‌టి కౌన్సిల్‌లో నిర్ణయం
- పాప్‌కార్న్‌పై మూడు రకాల పన్నులు



న్యూఢిల్లీ : జీవిత బీమా, ఆరోగ్య బీమా పాలసీ ప్రీమియంలపై వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) తగ్గింపు అంశాన్ని జిఎస్‌టి కౌన్సిల్ వాయిదా వేసింది. శనివారం జైసల్మేర్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 55వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం జరిగింది. ప్రస్తుతం బీమా ఉత్పత్తులపై 18 శాతం పన్ను రేటు అమల్లో ఉంది. ఇది చాలా ఎక్కువని.. ముఖ్యంగా ప్రజలను బీమాకు దూరం చేసేలా పన్ను విధానం ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. తాజా కౌన్సిల్‌లో దీనిపై ఆరంభంలోనే చర్చించారు. మరింత లోతైన చర్చ అవసరమని పలువురు సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేయడంతో ఈ నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు మంత్రుల బృందానికి నేతృత్వం వహించిన బీహార్ డిప్యూటీ సిఎం సామ్రాట్ చౌదరి తెలిపారు. రూ.5 లక్షల వరకూ సీనియర్ సిటిజన్ల ఆరోగ్య బీమా, టర్మ్ జీవిత బీమా పాలసీపై జిఎస్‌టిని ఐదు శాతానికి తగ్గించాలని సామ్రాట్ చౌదరి బృందం ప్రతిపాదించింది. జనవరిలో మరోమారు మంత్రుల బృందం సమావేశం అవుతుందన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్, వ్యక్తిగత బీమా పాలసీ లేదా సీనియర్ సిటిజన్ల బీమా పాలసీ తదితర అంశాలపై మరోసారి చర్చిస్తామన్నారు. బీమా పాలసీల ప్రీమియంలపై జిఎస్‌టి తగ్గించడం వల్ల తమ ఆదాయం పడిపోతుందని పలు రాష్ట్రాల ఆర్థిక మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారని చౌదరి తెలిపారు. రూ.5 లక్షలు దాటిన ఆరోగ్య బీమాపై 18 శాతం జిఎస్‌టి రేటు యధాతథంగా కొనసాగుతుంది. దీంతో సామాన్యులకు మరోసారి నిరాశే ఎదురైంది.

పాప్‌కార్న్‌పై మూడు రకాల పన్ను రేట్లను అమలు చేయాలని జిఎస్‌టి కౌన్సిల్ నిర్ణయించడం విశేషం. రుచిని బట్టి రేటు ఉంటుందని తెలిపింది. సాల్ట్ లేదా మసాలా పాప్ కార్న్ ప్యాక్ చేయకుండా అమ్మితే దానిపై 5 శాతం జిఎస్‌టి పడనుంది. ఇక ప్యాక్ చేసి అమ్మితే 12 శాతం, షుగర్ కలిపిన పాప్ కార్న్ అయితే 18 శాతం జిఎస్‌టి వసూలు చేయాలని నిర్ణయించారు. జిఎస్‌టి రేట్ల హేతుబద్ధీకరణకు సంబంధించి ఏర్పాటైన మంత్రుల బృందం 148 వస్తువుల రేట్లను హేతుబద్ధీకరించాలని ప్రతిపాదించింది. అందులో సిగరెట్లు, శీతల పానీయాలు, పొగాకు ఉత్పత్తులు ఉన్నాయి. ప్రస్తుతం వీటిపై ఉన్న 28 శాతం జిఎస్‌టిని 35 శాతానికి చేర్చాలన్న కీలక ప్రతిపాదనపై కౌన్సిల్‌లో చర్చించినట్లు సమాచారం. స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లపై విధిస్తున్న 18 శాతం జిఎస్‌టిని 5 శాతానికి తగ్గించేందుకు ఫిట్‌మెంట్ కమిటీ ప్రతిపాదించింది. దీనిపై నిర్ణయం వాయిదా వేయాలని కౌన్సిల్ భావించింది. పెట్రోల్, డీజిల్ చిన్న కార్లపై ప్రస్తుతం ఉన్న 12 శాతం జిఎస్‌టిని 18 శాతానికి పెంచాలని నిర్ణయం తీసుకుంది. పాత ఎలక్ట్రిక్ వాహనాలకు కూడా ఇది వర్తిస్తుంది. ప్రస్తుతం పెద్ద కార్లకు 18 శాతం జిఎస్‌టి వర్తిస్తోంది. ప్రస్తుతం జిఎస్‌టితో 5, 12, 18, 28 పన్ను శ్లాబులు ఉన్నాయి. కొత్తగా 35 శాతం శ్లాబ్‌ను తీసుకురావాలని మంత్రుల బృందం ప్రతిపాదించింది. హానికర ఉత్పత్తులకు ఈ శ్లాబు రేటును వర్తింపజేయాలని పేర్కొంది. ఫోర్ట్‌ఫైడ్ బియ్యంపై జిఎస్‌టి 5 శాతానికి తగ్గించాలని కౌన్సిల్ నిర్ణయించింది. జన్యు చికిత్సలకు పన్ను మినహాయింపునిచ్చింది. రుణ గ్రహీతలపై బ్యాంకులు, బ్యాంకింగేతర విత్త సంస్థలు (ఎన్‌బిఎఫ్‌సిలు) వేసే జరిమానాలపై జిఎస్‌టిని ఎత్తివేశారు.

ఐదేళ్లలో 47 టీవీ ఛానళ్ల లైసెన్సులు రద్దు

న్యూఢిల్లీ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గత ఐదేళ్లలో 47 టీవీ ఛానళ్ల లైసెన్సులను రద్దు చేసింది. ఈ విషయాన్ని ఇటీవల రాజ్యసభలో సిపిఎం ఎంపి వి.శివదాసన్ అడిగిన ప్రశ్నకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ సమాధానంలో వెల్లడించారు. గత ఐదేళ్లలో 110 ఛానళ్లకు కొత్త లైసెన్సులు ఇవ్వగా 269 లైసెన్సులు రెన్యూవల్ అయ్యాయి. 34 ఛానెల్స్ లైసెన్స్ దరఖాస్తును తిరస్కరించినట్లు మంత్రి తెలిపారు. చారిత్రాత్మక రైతుల సమ్మె జరిగిన 2020-21లో అత్యధిక సంఖ్యలో లైసెన్స్‌లు రద్దు చేశారు. దీనిపై శివదాసన్ మాట్లాడుతూ చానళ్లు, ఇతర మీడియాలకు అనుమతులు ఇచ్చే ప్రక్రియ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉందని, ఇది ప్రజాస్వామ్యానికి సవాల్ అని విమర్శించారు. లైసెన్స్ రద్దు భయంతో మీడియా కూడా కేంద్ర విధానాలను విమర్శించేందుకు భయపడుతోందన్నారు. మీడియా లైసెన్సింగ్ అధికారాన్ని 'ఇండియన్ బోర్డ్ ఆఫ్ మీడియా సర్వీసెస్' అనే స్వతంత్ర కమిటీకి బదిలీ చేయాలని కోరుతూ శివదాసన్ రాజ్యసభలో ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టారు.

సంబంధాల బలోపేతమే లక్ష్యం

- కువైట్ పర్యటనలో ప్రధాని మోడీ



కువైట్ : భారత ప్రధాని నరేంద్రమోడీ రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం కువైట్ చేరుకున్నారు. 1981లో ప్రధానిగా ఉన్న సమయంలో ఇందిరాగాంధీ కువైట్‌ని సందర్శించారు. 2009లో భారత ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ ఈ పశ్చిమాసియా దేశాన్ని సందర్శించారు. దాదాపు 43 ఏళ్ల తర్వాత కువైట్‌లో పర్యటించిన రెండవ ప్రధానిగా మోడీ నిలిచారు. కువైట్ అమీర్ షేక్ మెషల్ అల్ అహ్మద్ అల్ జాబర్ అల్ - సబాహ్ ఆహ్వానం మేరకు ప్రధాని మోడీ పర్యటించనున్నారు. మోడీ రెండు రోజుల పర్యటనలో కువైట్ ప్రధాని, ఆ దేశ యువరాజు సబా అల్ - ఖలిద్ అల్ - సబాతో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, విద్యుత్, సంస్కృతులపై, ప్రజల మధ్య సంబంధాలపై ఇరువురు ప్రధానులు చర్చించుకోనున్నారు.

ఈ పర్యటనలో భాగంగా మోడీ భారతీయ బ్లూ కాలర్ కార్మికులు ఉన్న లేబర్ క్యాంప్‌ను కూడా సందర్శించనున్నారు. మోడీ పర్యటన ఇరు దేశాల మధ్య కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ తెలిపింది. రామాయణ, మహాభారతాలను అరబిక్‌లోకి అనువదించిన అబ్దుల్లా అల్ బరౌన్, వాటిని ప్రచురించిన అబ్దుల్ లతీఫ్ అల్ నసీఫ్‌లను మోడీ శనివారం కలుసుకున్నారు. ఇరు దేశాల మధ్య భవిష్యత్తుల్లో భాగస్వామ్యానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించు కోవడానికి ఈ పర్యటన ఒక అవకాశం కల్పించిందని మోడీ ఢిల్లీ నుండి బయలుదేరడానికి ముందుగా వ్యాఖ్యానించారు. కువైట్‌లో భారతీయులు 21శాతంగా వున్నారు. అక్కడి కార్మిక శక్తిలో 30శాతం మంది భారతీయులే.

అమెరికా ఆర్థిక దిగ్బంధనాన్ని ఎత్తివేయాలంటూ

క్యూబాలో భారీ ర్యాలీ



హవానా : తీవ్రవాదానికి క్యూబా ఊతమిస్తోందనే అమెరికా ఆరోపణలను క్యూబా అధ్యక్షుడు మిగుయెల్ డియాజ్ కానెల్ తీవ్రంగా ఖండించారు. అవన్నీ అనైతికమైన, తప్పుడు ఆరోపణలని ఆయన వ్యాఖ్యానించారు. క్యూబా పట్ల అమెరికా అనుసరించే విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ వేలాదిమంది క్యూబన్లు జోస్ మార్టి సామ్రాజ్యవాద వ్యతిరేక వేదిక వద్ద శుక్రవారం పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. అమెరికా అమలు చేస్తున్న ఆర్థిక ఆంక్షలకు ఇక స్వస్తి పలకాలని డిమాండ్ చేస్తూ క్యూబా ప్రభుత్వం ఈ ప్రదర్శనకు పిలుపునిచ్చింది. తీవ్రవాదానికి దోహదపడే దేశాల జాబితా నుండి క్యూబాను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. క్యూబా సామాజిక, ఆర్థిక వ్యవస్థలకు వ్యతిరేకంగా తీవ్రవాద కార్యకలాపాలు చేపట్టేందుకు పారా మిలటరీ బలగాలకు శిక్షణ ఇచ్చే దేశం ఇటువంటి ఆరోపణలు చేయడం చాలా అనైతికమని క్యూబా అధ్యక్షుడు తీవ్రంగా నిరసించారు. ఈ జాబితాలో క్యూబాను కొనసాగించడం సమర్ధనీయం కాదని విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ సహా అమెరికా ప్రభుత్వ సీనియర్ అధికారులు కూడా అంగీకరించారని క్యూబా అధ్యక్షుడు పేర్కొన్నారు. ఆ జాబితాలో క్యూబాను కొనసాగించడం, నిర్దాక్షిణ్యంగా ఆంక్షలను అమలు చేయడం తక్షణమే విరమించాల్సి వుందని అధ్యక్షుడు స్పష్టం చేశారు. తమ హక్కులు, సార్వభౌమాధికారం విషయంలో క్యూబన్లు అందరూ సమైక్యతతోనే వున్నారని ఈ ప్రదర్శన మరోసారి స్పష్టం చేసింది.

కజాన్‌లోని భారీ భవంతులపై డ్రోన్ల దాడులు

మాస్కో : రష్యా నగరమైన కజాన్‌లో పలు నివాస భవంతులపై ఉక్రెయిన్ డ్రోన్లతో దాడి చేసింది. మూడు కమికజ్ డ్రోన్‌లు ఈ దాడులకు దిగాయని శనివారం ఉదయం స్థానిక అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోలను పలు మీడియా సంస్థలు విడుదల చేశాయి. ఉక్రెయిన్‌కి చెందిన మానవ రహిత వాహనాన్ని తమ రక్షణ బలగాలు ధ్వంసం చేశాయని అంతకుముందు రష్యా రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి.కజాన్‌లో మౌలిక పౌర సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ ఈ డ్రోన్ దాడులకు పాల్పడిందని రష్యన్ మిలటరీ అధికారులు తెలిపారు.

బంగ్లా ఎన్నికల ప్రణాళికను స్వాగతించిన అమెరికా

ఢాకా: బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికలు వచ్చే ఏడాది చివరిలో కాని, 2026 ప్రారంభంలో కానీ జరుగుతాయని తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ అడ్వయిజర్ మహ్మద్ యూనస్ ఇటీవల చేసిన ప్రకటనను అమెరికా స్వాగతించింది. అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి వేదాంత్ పటేల్ విలేకరులతో మాట్లాడుతూ, బంగ్లా దేశ్ ప్రజలు తమ సొంత ప్రభుత్వ ప్రతినిధులను ఎన్నుకునేందుకు ఈ ఎన్నికలు వీలు కల్పిస్తాయని అన్నారు. ఈ ఎన్నికల ప్రక్రియ చట్టబద్ధ పాలన, గౌరవాన్ని అమెరికా ప్రోత్సహిస్తుందని ఆయన చెప్పారు.

జర్మనీలో క్రిస్మస్ మార్కెట్‌పై దాడి

- ఐదుగురు మృతి, 200మందికి పైగా గాయాలు

బెర్లిన్ : జర్మన్ నగరమైన మగ్దెబర్గ్‌లో రద్దీగా వున్న క్రిస్మస్ మార్కెట్‌పై జరిగిన దాడిలో ఐదుగురు మరణించారు. 200మందికి పైగా గాయపడ్డారు. వీరిలో చాలామందికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ మేరకు సాక్సోనీ-అన్హల్ట్ రాష్ట్ర గవర్నర్ రెయినర్ హేజెలాఫ్ శనివారం ఒక ప్రకటన చేశారు. శుక్రవారం సాయంత్రం సౌదీ డాక్టర్ ఒకరు ఉద్దేశపూర్వకంగానే నల్ల బిఎండబ్ల్యు కారును మార్కెట్‌లోకి నడుపుకుంటూ వెళ్లారని ఆ ప్రకటన తెలిపింది. రాత్రి 7గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగిన వెంటనే నిందితుడిని అరెస్టుచేశారు. ఆ సమయంలో పండుగ కోసం షాపింగ్ చేసేవారితో మార్కెట్ అంతా రద్దీగా వుంది. అనుమానితుడిని ఆ పక్కనే రోడ్డుపైనే అరెస్టు చేసినట్లు వీడియో ఫుటేజీని బట్టి తెలుస్తోంది. 50ఏళ్ల సౌదీ డాక్టర్ 2006లో జర్మనీకి వలస వచ్చేశారు. పోలీసులు దీనిపై వ్యాఖ్యానించడానికి అందుబాటులోకి రాలేదు. తొలుత ఇద్దరే మరణించారని భావించినా, తర్వాత మృతుల సంఖ్య పెరిగింది. తీవ్రంగా గాయపడిన వారు 127మంది వున్నారని, 78మందికి స్వల్ప గాయాలయ్యాయని మీడియా వార్తలు తెలిపాయి. ఈ దాడి వార్త నగర ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది. మేయర్ కళ్ళనీళ్ళ పర్యంతమయ్యారు. ఈ సంఘటనకు సంఘీభావంగా పలు ఇతర పట్టణాల్లో వారాంతపు క్రిస్మస్ మార్కెట్లను మూసివేశారు.

ట్రూడోపై అవిశ్వాసం పెడతా

- ఎన్‌డిపి నేత జగ్మీత్ సింగ్ ప్రకటన


టొరంటో : కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో నాయకత్వ భవితవ్యం అనిశ్చితిలో పడినట్లు కనిపిస్తోంది. మైనారిటీ లిబరల్ ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి తీర్మానం ప్రవేశపెడతానని కీలక మిత్రపక్షమైన న్యూ డెమొక్రటిక్ పార్టీ (ఎన్‌డిపి) నేత జగ్మీత్ సింగ్ ప్రకటించడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో బహిరంగ లేఖ పెట్టారు. కొత్త సంవత్సరంలో ట్రూడో నాయకత్వంలోని లిబరల్ ప్రభుత్వంపై అవిశ్వాసాన్ని ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ చర్యకు ఇతర ప్రతిపక్షాలు కూడా మద్దతిచ్చినట్లైతే సత్వరమే ఎన్నికలు వచ్చే అవకాశం వుందని భావిస్తున్నారు. ట్రంప్ టారిఫ్‌లపై ప్రధానితో విభేదాలు తలెత్తి కెనడా డిప్యూటీ ప్రధాని రాజీనామా చేశారు. అక్టోబరులోగా కెనడాలో ఎన్నికలు నిర్వహించాల్సి వుంది.21మంది లిబరల్ ఎంపీలు కూడా ప్రధాని రాజీనామాను డిమాండ్ చేస్తున్నారు. ఈ వారంలో ట్రూడో ప్రభుత్వానికి తగిలిన రాజకీయ ఎదురు దెబ్బల్లో సింగ్ లేఖ తాజాది.

తైవాన్‌కు 571.3 మిలియన్ల డాలర్లు

- బైడెన్ ప్రభుత్వ నిర్ణయం

వాషింగ్టన్ : చైనాకు వ్యతిరేకంగా తైవాన్‌ను ఎగదోస్తున్న అమెరికా ఇప్పుడు ఆ దీవికి 571.3 మిలియన్ల డాలర్ల మిలిటరీ సాయం అందించాలని నిర్ణయించింది. మరో నెల రోజుల్లో అధ్యక్ష పదవి నుంచి వైదొలగనున్న జో బైడెన్ హడావుడిగా దీనికి ఆమోదం తెలిపారు. 265 మిలియన్ల డాలర్ల విలువ చేసే సైనిక పరికరాలను అమెరికా అందజేయనుంది. అంతకుమించి వివరాలను వైట్‌హౌస్ పేర్కొనలేదు. తైవాన్ జలసంధిలో శాంతి భద్రతలకు హామీ కల్పించేలా భద్రతాపరమైన అంశాలపై ఉభయ పక్షాలు సన్నిహితంగా పనిచేస్తాయని ఒక ప్రకటనలో పేర్కొంది. 265 మిలియన్ల డాలర్ల విలువ చేసే కమాండ్, కంట్రోల్, కమ్యూనికేషన్, కంప్యూటర్ ఆధునీకరణ పరికరాలను తైవాన్‌కు విక్రయించేందుకు విదేశాంగ శాఖ కూడా ఆమోదం తెలిపింది. పెంటగన్ పేర్కొంది. ఈ మిలటరీ సామాగ్రితో తమ కమాండ్, కంట్రోల్ వ్యవస్థలు ఆధునీకరించబడతాయని తైవాన్ రక్షణ శాఖ తెలిపింది.

55వేల మంది విద్యార్థుల రుణాలు మాఫీ



వాషింగ్టన్ : పబ్లిక్ సర్వీస్ లోన్ ఫర్‌గివ్‌నెస్ కార్యక్రమం కింద 55వేల మంది వర్కర్ల ఫెడరల్ విద్యార్థి రుణాలను బైడెన్ ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు విద్యా శాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వ విభాగాల్లో లేదా లాభరహిత ఉద్యోగాల్లో పదేళ్ళు పనిచేసిన తర్వాత రుణాలు రద్దు చేస్తామని ఈ కార్యక్రమం కింద హామీ ఇచ్చారు. ఆ మేరకు అర్హత సాధించిన టీచర్లు, నర్సులు, సర్వీస్ మెంబర్లు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తదితరులు ఈ ప్రయోజనాన్ని పొందుతున్నారు. జనవరిలో అధికారం నుండి వైదొలగనున్న బైడెన్ ప్రభుత్వం చిట్టచివరిగా కల్పించే ఉపశమన చర్య ఇదేనని భావిస్తున్నారు. గతంలో నిబంధనలు కఠినతరంగా వుండడంతో 99శాతం తిరస్కరణ రేటు వుండేది అటువంటి బైడెన్ హయాంలో పబ్లిక్ సర్వీస్ లోన్ ఫర్‌గివ్‌నెస్ నిబంధనలను సరళతరం చేశారు. తాజా చర్యలతో ఈ కార్యక్రమాల ద్వారా 180బిలియన్ల డాలర్ల విద్యార్థి రుణాలను బైడెన్ రద్దు చేశారు.



ఫడ్నవీస్ వద్దే హోం శాఖ

- మహారాష్ట్ర మంత్రులకు శాఖల కేటాయింపు

ముంబయి: మహారాష్ట్రలో కొలువుదీరిన మహాయుతి ప్రభుత్వంలో శనివారం మంత్రులకు శాఖలను కేటాయించారు. కీలకమైన హోం మంత్రిత్వశాఖను ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నిర్వహించనున్నారు. దీంతోపాటు సాధారణ పరిపాలన, విద్యుత్, న్యాయ, ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిసిటీ శాఖలు కూడా ముఖ్యమంత్రి ఫడ్నవీస్ అధీనంలోనే ఉంటాయి. ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ, ప్రజా పనుల (పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్) శాఖలను అప్పగించారు. మరో ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్‌కు ఆర్థికశాఖ, ఎక్సైజ్ శాఖలను అప్పగించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి చంద్రశేఖర్ బావన్‌కులే రెవెన్యూశాఖ నిర్వహించనున్నారు. ఈ మేరకు గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. అలాగే రాధాకృష్ణకు జలవనరులు (గోదావరి -కృష్ణ లోయ అభివద్ధి కార్పొరేషన్), కేటాయించారు. హసన్ మియాలాల్‌కు వైద్య విద్య, చంద్రకాంత్ సరస్వతికి ఉన్నత, సాంకేతిక విద్య, శాసనసభ వ్యవహారాలు, గిరీశ్ గీతా దత్తాత్రేయ మహాజన్‌కు జలవనరులు (విదర్భ, తాపీ, కొంకణ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్), విపత్తు నిర్వహణ శాఖ కేటాయించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్ శాఖను జయకుమార్ గోరే, ఆహం-ఔషధ పరిపాలనను నరహరి జిర్వాల్‌కు కేటాయించారు. రవాణా శాఖను ప్రతాప్ సరైక్, ఉపాధి హామీపథకం, పట్టుపరిశ్రమ శాఖను భరత్‌సేథ్ గోగవాలేకు కేటాయించారు.

కేజ్రీవాల్ ప్రాసిక్యూషన్‌కు లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఢిల్లీ మాజీ సిఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ షాక్ తగిలింది. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌ను విచారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా అనుమతినిచ్చారు. ఈ కేసులో డిసెంబర్ 5న మాజీ సిఎంను విచారించేందుకు ఇడి అనుమతి కోరగా.. అందుకు ఎల్‌జి తాజాగా అనుమతినిచ్చింది. ఈ మేరకు ఎల్‌జి కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మార్చి 21న ఇడి ఆయనను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మే 10 నుంచి జూన్ ఒకటి వరకు ఆయనకు తాత్కాలిక బెయిల్ మంజూరైంది. జూన్ 2న ఆయన మళ్లీ జైలులో లొంగిపోగా, జూన్ 20న ట్రయల్ కోర్టులో బెయిల్ దక్కింది. బెయిల్‌ను ఇడి సవాల్ చేయడంతో జూన్ 25న హైకోర్టు బెయిల్ ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. జూన్ 26న ఇదే కేసులో కేజ్రీవాల్‌ను సిబిఐ అరెస్టు చేసింది. జులై 12న ఇడి కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ సిబిఐ అప్పటికే అరెస్టు చేయడం వల్ల ఆయన జైలులోనే ఉండాల్సి వచ్చింది. ఇక సెప్టెంబరు 13న సిబిఐ కేసులోనూ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ దక్కడంతో ఆరు నెలలపాటు జైలు జీవితం గడిపిన ఆయన చివరికి సెప్టెంబర్ 14న తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. ఈ కేసులోనే ఇడి మరోసారి కేజ్రీవాల్‌ను విచారించేందుకు సిద్ధమవుతోంది.

అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రచారం

- 24న దేశవ్యాప్తంగా అంబేద్కర్ సమ్మాన్ మార్చ్‌లు
- రాష్ట్రపతి, అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రచారం ముమ్మరం చేసింది. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో రిజర్వేషన్‌లను అంతం చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందనే అంశాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రచారానికి సిద్ధమైంది. శనివారం నాడిక్కడ ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ అధ్యక్షులు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఆ పార్టీ ఎంపి కెసి వేణుగోపాల్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అలాగే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శనివారం విలేకరుల సమావేశాలు నిర్వహించింది. అంబేద్కర్ సమ్మాన్ (గౌరవం) రాబోయే కొద్ది రోజుల్లో ప్రదర్శనలు నిర్వహించాలని సూచించింది. 'మనుస్మృతి ఆరాధకులకు వ్యతిరేకంగా బాబాసాహెబ్ అంబేద్కర్ వారసత్వాన్ని రక్షించడానికి మేము పోరాడతాము. కాంగ్రెస్ వారం రోజులపాటు డాక్టర్ అంబేద్కర్ సమ్మాన్ నిర్వహిస్తుంది' అని కెసి వేణుగోపాల్ 'ఎక్స్' ప్రకటించారు. కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు, పార్టీ కార్యవర్గ సభ్యులు, పార్టీ సీనియర్ నేతలు ఆది, సోమవారాల్లో తమ నియోజకవర్గాలు, సొంత జిల్లాల్లో 150 మంది విలేకరుల సమావేశాలు నిర్వహించనున్నారు. '24న దేశవ్యాప్తంగా బాబాసాహెబ్ అంబేద్కర్ సమ్మాన్ మార్చ్‌లు నిర్వహిస్తాం. అమిత్ షా రాజీనామాను డిమాండ్ చేస్తూ జిల్లాల కలెక్టర్లు, రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పిస్తాం' అని వేణుగోపాల్ తెలిపారు.

పారదర్శకతపై భయమెందుకు?

- ఎన్నికల నిబంధనల్లో మార్పులపై కాంగ్రెస్

న్యూఢిల్లీ : ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నియమాల్లో మార్పులు చేయడం పారదర్శకతపై భయానికి నిదర్శనమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జైరామ్ రమేష్ పేర్కొన్నారు. సోషల్ మీడియా ఎక్స్‌లో ఆయన ఈ మేరకు పోస్టు చేశారు. ఇటీవల జరిగిన హర్యానా అసెంబ్లీల్లో ఒక బూత్‌కు సంబంధించిన వీడియో, సిసి టివి పుటేజ్‌ను పిటిషనర్‌కు అందజేయాలని పంజాబ్ - హర్యానా హైకోర్టు ఆదేశించిందని, ఈ ఆదేశాలతో కేంద్రం ఎన్నికల సంఘం, కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖలు పై నిబంధనల్లో మార్పులు చేశాయని విమర్శించారు. కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ఎన్నికల నియమావళిలోని రూల్ 93(2)(ఎ)ను మార్చిందని తెలిపారు. గతంలో ఉన్న 'ఎన్నికలకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు ప్రజల తనిఖీ కోసం ఉంచబడతాయి' అనే నిబంధనను ఇప్పుడు 'ఎన్నికలకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు ప్రజలు చదవడం కోసం ఉంచబడతాయి' అని మార్చిందని తెలిపారు. ఇటీవల కాలంలో కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించే ఎన్నికల ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు సరైనవి అని చెప్పడానికి తాజా ఉత్తర్వులు నిదర్శనమని అన్నారు.

అమరావతిలో 'పైసా వసూల్'

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. దీనికోసం నిర్దిష్ట కాలపరిమితితో ఆర్థిక ప్రణాళికను సిద్ధం చేస్తామని హామీనిచ్చినట్లు ప్రపంచబ్యాంకు నివేదికలో పొందుపరిచారు.

'ప్రైవేటు''కే సేవలు

పౌరసేవా రంగాలన్నింటిన్ని ప్రైవేటు రంగానికి అప్పగించడం ద్వారా కాస్ట్ రికవరి విధానాన్ని, యూజర్ ఛార్జీలను పటిష్టంగా అమలు చేయాలని ఈ నివేదికలో ప్రపంచబ్యాంకులో సూచించింది. పైగా దీనిని ' ఫలితాలు వచ్చే ప్రాంతాల్లో ఒకటవ విభాగంలోచేర్చడం (రిజల్ట్స్ ఏరియాస్ -1) ద్వారా బ్యాంకు ప్రాధాన్యత ఏమిటో స్పష్టమవుతోంది. 'నీళ్లు, పారిశుద్ధ్యం, డ్రైనేజితో పాటు ఇతర మౌలికసదుపాయల నిర్వహణకు వృత్తిపరమైన నిపుణులను ప్రభుత్వం నియమించాలి. నివసించే ప్రజలకు, వ్యాపార సంస్థలకు ఈ సేవలను అందించడంతోపాటు ఖర్చుకు తగ్గట్టుగా రికవరి టారిఫ్‌ను సిద్ధం చేసి, వసూళ్లు చేసే నైపుణ్యం వారికి ఉండాలి. క్రమేణా యూజర్ ఛార్జీలను వసూలు చేయడం, ప్రైవేటు రంగాన్ని ఈ సేవల్లోకి తీసుకురావడం వంటి పనులు చేయాలి' అని పేర్కొన్నారు. రుణ మంజురుకు సంబంధించిన పత్రంలోనే 'ప్రైవేటు రంగ ఏర్పాటుకు, స్థిరపడటానికి, అభివృద్ధి చెందడానికి అవకాశం ఉండాలి' అని బ్యాంకు పేర్కొన్న విషయం ఈ సందర్భంగా గమనార్హం. కమ్యూనిటీ, పరిసర ప్రాంతాల అభివృద్ధి వంటి పనుల్లో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇక్కడ భాగస్వామ్యం అంటే, ఏదో రకంగా ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపడమే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిలో భాగంగానే ఏయే సేవారంగానికి ఎంత మొత్తాన్ని రుణంగా ఇస్తున్న అంశాన్ని కూడా ప్రపంచబ్యాంకు వివరించింది, ఉదాహరణకు రోడ్లు, నీళ్లు, విద్యుత్, డ్రైనేజి తదితర మౌళిక వసతుల రంగానికి 884 మిలియన్ డాలర్లను కేటాయిస్తున్నట్లు ప్రపంచబ్యాంకు పేర్కొంది. ఆర్‌బిఎల్ విధానం ప్రకారం ఈ మొత్తాన్ని ఖర్చు చేసే సమయానికి ఆ మేరకు నిర్దేశించిన 'ఫలితాలను' కూడా సాధించాలి. ఇక్కడ ఫలితాలంటే ఏమిటో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అమరాతికి తీసుకునే అప్పును ప్రజల నుండే వివిధ రూపాల్లో వసూలు చేస్తారని 2016లోనే ప్రజాశక్తి ప్రచురించడం గమనార్హం.



మీకోసం

నూనె డబ్బాలను శుభ్రపరుచుకునేటప్పుడు అందులో కాస్త గళ్లుప్ప వేసి తోముకుంటే జిడ్డు పోతుంది.

జీవన సౌరభం

మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించాలి. బలహీనపరిచే ప్రతి ఆలోచననీ తిరస్కరించాలి.

సులభంగా.. సరళంగా గణితం

అనంతపురం జిల్లా గుత్తి మున్సిపాలిటీ పరిధి చెట్నేపల్లి గ్రామానికి చెందిన క్రిపాటి భీమలింగప్ప, నాగమణిల దంపతుల కుమార్తె సి.రాధిక 1982 ఆగస్టు 6న జన్మించారు. ఎమ్మెస్సీ మ్యాథ్స్, బిఇడి పూర్తిచేసిన ఆమె 2002 డిఎస్సీ ద్వారా గుత్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెకండరీగ్రేడ్ టీచర్‌గా ఉద్యోగంలో చేశారు. 2012లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి విద్యార్థులకు గణితంపై ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ఆమె తన వంతుగా నిరంతరం కృషిని కొనసాగిస్తూనే ఉన్నారు. 'మై మ్యాథ్స్ రాధిక' పేరుతో యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నారు. సులభంగా గణితం నేర్చుకునే విధానాలపై 650 వరకూ వీడియోలు రూపొందించి పోస్టు చేశారు. వీటిని ఇప్పటివరకూ 1.30 లక్షలమంది వీక్షించారు. పనిచేసే పాఠశాలే కాకుండా ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయుల సందేహాలను ఆమె తీరుస్తున్నారు. గణితంపై పట్టు సాధించేలా యానిమేషన్ వీడియోలను సైతం రూపొందించారు.

గణితమా? వామ్మో.. చాలా కఠినమైన సబ్జెక్టు అని చాలామంది అంటుంటారు. నిరంతరం ప్రోత్సహిస్తూ సాధన చేయించి ఫార్ములాలు నేర్చుకుంటే 'అమ్మో గణితమా?' అనే వారు 'ఆహా గణితమా?' అని అంటారని ఉపాధ్యాయురాలు సి.రాధిక అంటున్నారు. సాంకేతికంగా సెల్‌ఫోన్ వినియోగంపై పిల్లలకు బాగా అవగాహన ఉంటోంది. తరగతిలో పాఠాలు విన్నా వీడియోల ద్వారా మరోసారి ఫార్ములాలను చూసి తెలుసుకోవటం ద్వారా బాగా గుర్తుంటుందని చెబుతున్నారు. రోజువారీ జరిగే వివిధ అంశాలను అన్వయిస్తూ ప్రాజెక్టులు తయారు చేయిస్తూ విద్యార్థులకు సబ్జెక్టు అంశాలను సులువుగా అర్థమయ్యేలా వివరిస్తున్నారు.



సులభమైన పద్ధతుల్లో...

అంశాలు నేర్పించటం, సూత్రాలను బట్టీ తరహాలో కాకుండా అంకెలు, సంజ్ఞల రూపంలో చెప్పించటం, సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులకు సైతం అర్థమయ్యే రీతిలో స్వేచ్ఛగా భావవ్యక్తీకరణకు అవకాశం కల్పించటం చేస్తున్నారు. విద్యార్థులు ఉత్సాహంగా కృత్యాల్లో పాల్గొనటం, మాట్లాడటం, చర్చించటం ద్వారా సులభంగా లెక్కలు చేయొచ్చునని ఆచరణలో నిరూపిస్తున్నారు. వీటిని వ్యక్తిగతంగానూ, జట్టు కృత్యంగానూ చేయిస్తూ మెరుగైన ఫలితాలు చేసిన వారికి బహుమతులు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. కూడికలు, గుణింతాలు, తీసివేతలు, భాగహారాలు, ఆరోహణ, అవరోహణ అంశాలను తను చెప్పటమే కాకుండా పిల్లలు ఆడుతూ పాడుతూ వాటిని గుర్తు పెట్టుకునేలా వారితోనే చెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. సూత్రాలు, పీరియాడిక్ టేబుళ్ల సులభంగా ఆటలు, పాటల్లోనూ జొప్పించి చేయిస్తున్నారు. తోటి ఉపాధ్యాయులను కూడా ఇదే తరహాలో బోధనకు కృషి చేస్తున్నారు.

పిల్లల్లో భయాన్ని పోగొడుతూ...

చూడగానే విద్యార్థులు తెలుసుకునేలా పాఠశాలల గోడలపైనా, తరగతి గదుల్లో ఆకర్షణీయంగా తన సొంత ఖర్చులతోనే పెయింటింగ్ వేయించారు. అనునిత్యం పిల్లలు చేత వివిధ ప్రాజెక్టులు చేయిస్తూ, సరికొత్తగా నమూనాలు తయారు చేయించిన బోధన సామగ్రిని భద్రపర్చుతున్నారు. మ్యాథ్స్ అంశాలపై సమగ్ర అవగాహన నిమిత్తం ల్యాబ్‌ను తయారుచేశారు.

పిల్లల ప్రపంచంలోకి వెళ్లాలి

తరగతిలో విద్యార్థులకు ఒకే విషయాన్ని పదే పదే చెబితే విసుగుకు వస్తుంది. అందువల్ల వారి ప్రపంచంలోనే పాఠాలు నేర్పాలి. ప్రస్తుతం చాలామంది విద్యార్థులకు చరవాణిపై పట్టు ఉంది. అందువల్ల యూట్యూబ్‌లో గణితశాస్త్రానికి సంబంధించిన వీడియోలను చిత్రీకరించాం. వీటిద్వారా విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుంటున్నారు.

– సి.రాధిక, గణిత ఉపాధ్యాయిని

ప్రత్యక్ష వీక్షణ... విద్యార్థులతో నిర్వహణ

నిజజీవితంలో ప్రతిచర్యా గణితంతోనే ముడిపడి వుంటుంది. కిరాణా సరుకులకు వెళ్లినా, మార్కెట్‌కు వెళ్లినా...కొనుగోళ్లు, అమ్మకాలు లెక్కలులోకే వస్తాయి. దుకాణాల్లో ఇచ్చే ఆఫర్లు, డిస్కౌంట్లు తెలిసిందే. ఇలాంటి విషయాలను సబ్జెక్టు అంశాలుగా పాఠశాలలోనే చేయిస్తే ప్రతి విద్యార్థికి సులభంగా అర్థమవుతుంది. పిల్లలతోనే దుకాణాలు ఏర్పాటు చేయటం, అమ్మకందారులు, కొనుగోలు దారులూ వారే. రైతులుగా మరికొందరు విద్యార్థులు పంటలను అమ్ముతుంటారు. అదే వస్త్ర దుకాణానికి వెళ్తే 10 శాతం డిస్కౌంట్ ఇస్తే దానిని ఎలా తీసుకోవాలో పిల్లలే చెబుతారు. ఉమ్మడిగా కూరగాయలు విక్రయించగా వచ్చే డబ్బుల్లో లాభాలను ఎలా పంచుకుంటారో తెలియజేస్తున్నారు. సాధారణంగా శుభ కార్యాల్లో ఆడపిల్లలకు పూలజడలు వేస్తుంటారు. ఈ పాఠశాలలో మాత్రం గణితానికి సంబంధించిన జడలు వేసి పిల్లలకు ఈజీగా నేర్పిస్తారు.

డిజిటల్‌తో ఆహా గణితమా?

శ్రద్ధపెట్టి ప్రాక్టీస్ చేయాలో కానీ. మ్యాథ్స్‌కి మించిన ఈజీ సబ్జెక్ట్ మరొకటి ఉండదు. అయితే చిన్నప్పుడు బేసిక్స్‌పై పట్టురాకపోతే ఉన్నత చదువులకు వెళ్లినప్పుడు కష్టంగా అనిపిస్తుంది. ఫార్ములాలను నేర్పించటం, ప్రాక్టీస్ చేయిస్తున్నారు. ఎప్పటిది అప్పుడే చేయటం, నైపుణ్యాలను మెరుగుపర్చుకోవటం, శ్రద్ధ వహించడం, తరగతి సమయంలో ప్రశ్నలు అడగటానికి లేదా సహాయం కోసం ఉపాధ్యాయులతో మాట్లాడటానికి అనువైన వాతావరణాన్ని కల్పించారు. పాఠశాల పూర్తయిన తర్వాత కూడా మరో గంట అదనపు సమయం కేటాయిస్తూ వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

ఆస్ట్రేలియా విశ్రాంత గణిత ఉపాధ్యాయుడు వెర్నన్, ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ వెంకట కృష్ణారెడ్డి, ఆర్‌జెడి శ్యామ్యూల్ తదితరులు గణిత ల్యాబ్‌ను సందర్శించి సి.రాధికను అభినందించారు.

డిజిటల్ బోధన

ఆమె చిత్రీకరించిన వీడియోలు 6 నుంచి 10వ తరగతి వరకూ తెలుగు, ఆంగ్ల మాధ్యమ విద్యార్థులందరికీ సులువుగా అర్థమవుతాయి. గుత్తికోటకు ప్రాచీన చరిత్ర ఉండటంతో జామితియా ఆకారంలో నమూనాను తయారుచేసి విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. ఆమె కష్టాన్ని గుర్తించిన ఆంధ్రా, తెలంగాణా ప్రభుత్వాలు టీచింగ్ ఎక్సలెన్స్ వంటి 20 అవార్డులిచ్చి సత్కరించాయి. 2023లో రాష్ట్రప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించింది. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేక సత్కారాలు, సన్మానాలు, అవార్డులు అందుకున్నారు.

విద్యార్థుల ఇంటికి ...

పిల్లలున్న ప్రతి పల్లెకి రాత్రివేళల్లో వెళ్తుంటారు. విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ప్రత్యక్షంగా కలిసి మాట్లాడతారు. పదో తరగతి విద్యార్థుల కోసం 'నైట్ విజన్' కార్యక్రమాన్ని చేపట్టారు. పిల్లలు ఎలా చదువుతున్నారు? పరిసరాలు అనుకూలంగా ఉన్నాయా? లేదా? అనేది పరిశీలించి తగిన సలహాలు ఇస్తారు. టీవీ, మొబైల్ ఉపయోగంపై ఆరాతీస్తారు. మంచి మార్కులు, చేతిరాత అభివృద్ధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తారు. తన పాఠశాల విద్యార్థులకే కాక తీరిక వేళల్లో యూట్యూబ్‌లోనూ పాఠాలు బోధిస్తూ వేలాదిమంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుస్తున్నారు.

– యడవల్లి శ్రీనివాసరావు



7 చుక్కలు 4 వరుసలకు (మధ్య చుక్క)

రంగవల్లి



బి.వి.ఎస్ కుమారి,
విశాఖపట్నం,
91774 99779.

మా చిరునామా
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

ఐకమత్యమే మహాబలం




అడవిలో ఓ పెద్ద చెట్టు ఉంది. దానిపై రకరకాల పక్షులు గూళ్లు కట్టుకొని తమ పిల్లలతో నివసిస్తుండేవి. ఒకరోజు ఆకాశమార్గాన పోతున్న ఓ పెద్ద పక్షిని ఆ చెట్టు ఆకర్షించింది. అది వెంటనే కిందకు దిగింది. శాఖోపశాఖలుగా విస్తరించిన చెట్టు దాన్ని బాగా ఆకట్టుకుంది. అక్కడే నివాసం ఏర్పాటు చేసుకుంది. అయితే చెట్టుమీద అప్పటికే ఉన్న చిన్న పక్షుల అరుపులు పెద్ద పక్షికి చికాకు తెప్పించేవి. వాటి కారణంగా సరిగ్గా నిద్రపోయేది కాదు. ఎలాగైనా పక్షులను అక్కడ నుంచి దూరంగా పంపేయాలని అనుకుంది. తల్లి పక్షులు బయటికి వెళ్లినప్పుడు వాటి గూళ్లను తొలగించటం, పిల్ల పక్షులను కింద పడేయడం చేసేది. రోజురోజుకీ పెద్ద పక్షి బాధ చిన్న పక్షులు భరించలేక పోయాయి. పిల్లల అవస్థలు చూడలేకపోయాయి.

పెద్ద పక్షిని ఎదిరించే ధైర్యం చేయలేక పక్కనే అడవిలో ఉన్న మిత్రుడికి తమ గోడుని చెప్పాయి. పెద్ద పక్షి బారి నుంచి రక్షించే మార్గం చెప్పమని వేడుకున్నాయి. స్నేహితులకు మిత్రుడు పక్షి ఉపాయం చెప్పింది. ఐకమత్యంతో ఎదిరించమని హితవు పలికింది. పక్షులకు అర్థం కాలేదు. 'ఆ పెద్ద పక్షి మాకంటే చాలా శక్తివంతమైనది. మేమెలా దాన్ని ఎదిరిస్తాం' అని అన్నాయి పక్షులు. 'ముందు మీరంతా మీ పిల్లల కోసం ఈ చెట్టు మీద తాత్కాలిక గూళ్లు ఏర్పరచుకోండి. ఆ తర్వాత మీరంతా ఏకమై పగలు రాత్రి తేడా లేకుండా పెద్ద పక్షికి విసుగు పుట్టించాలి. అది విశ్రమించే సమయంలో మీ అరుపులతో నిద్రాభంగం కలిగించాలి. అప్పుడు అది చెట్టు వదిలి పారిపోతుంద'ని వివరంగా చెప్పింది. పక్షులన్నీ అలాగే చేశాయి. కొన్ని రోజులకు పెద్ద పక్షి చెట్టును వదిలి మరో ప్రదేశానికి వెళ్లి పోయింది. పక్షులు తమకు సాయం చేసిన పక్షికి కృతజ్ఞతలు చెప్పి పిల్లలతో తమ నివాసాలకు చేరుకుని, ఆనందంగా ఉండసాగాయి.

– తమ్మవరపు వెంకట సాయి సుచిత్ర,
94923 09100.

నేను గీసిన బొమ్మ





బి.దరహాస్, 6వ తరగతి, శ్లోక కాన్సెప్ట్ స్కూలు, కుకునూరు, ఏలూరు జిల్లా.

లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న బాక్సులో కొన్ని లెక్కలు ఇచ్చాం. వాటి మధ్య ఉన్న గుర్తుల ఆధారంగా 'ఎ', 'బి', 'సి' విలువను కనుక్కోండి చూద్దాం.

9	+	B	=	19
+		+		+
A	+	8	=	14
=		=		=
15	+	C	=	D

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అదరగొట్టిన అశ్విన్ హెబ్బర్

- రైల్వేస్‌పై 91పరుగుల తేడాతో నెగ్గిన ఆంధ్ర
- విజయ్ హజారే వన్డే టోర్నీ



ముంబయి: విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ జట్లు ఘన విజయం సాధించాయి. డా.డివై పాటిల్ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు 91పరుగుల తేడాతో రైల్వేస్‌పై గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు 49.2ఓవర్లలో 294 పరుగులకు ఆలౌటైంది. అశ్విన్ హెబ్బర్(132), రికీ బుయ్(41), శ్రీకర్ భరత్(30) బ్యాటింగ్‌లో రాణించారు. రైల్వేస్ బౌలర్లు రాహుల్ శర్మకు నాలుగు, యువరాజ్ సింగ్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఆంధ్ర బౌలర్లు వినయ్(4/45), శశికాంత్(3/47), సత్యనారాయణ రాజు(2/35) చెలరేగి బౌలింగ్ చేశారు. దీంతో రైల్వేస్ 41.5ఓవర్లలో 203పరుగులకే పరిమితం చేశారు. రైల్వేస్ జట్టులో ఉపేంద్ర యాదవ్(64) అర్ధసెంచరీకి తోడు మహ్మద్ సైఫ్(46), సూరజ్(40) బ్యాటింగ్‌లో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అశ్విన్ హెబ్బుకు లభించింది.

మరో మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 42పరుగుల తేడాతో నాగాలాండ్‌ను చిత్తుచేసింది. హైదరాబాద్ జట్టు 48.1ఓవర్లలో 278పరుగులకు ఆలౌట్ కాగా.. ఆ తర్వాత నాగాలాండ్‌ను 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 234పరుగులకే పరిమితం చేసింది. హైదరాబాద్ జట్టులో అవినాశ్(100) సెంచరీతో రాణించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవినాశ్‌కు దక్కింది. సోమవారం జరిగే రెండో గ్రూప్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు రాజస్తాన్‌తో, హైదరాబాద్ జట్టు ముంబయితో తలపడనుంది.

ముంబయికి కర్ణాటక ఝలక్

అహ్మదాబాద్ వేదికగా ముంబయి-కర్ణాటక జట్ల మధ్య జరిగిన మరో లీగ్ మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. ముంబయి నిర్దేశించిన 383పరుగుల భారీ లక్ష్యాన్ని కర్ణాటక జట్టు కేవలం 3వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. కర్ణాటక జట్టులో కృష్ణన్ శ్రీజిత్(150నాటౌట్; 101 బంతుల్లో 20ఫోర్లు, 4 సిక్సర్లు), అనీశ్(82), ప్రవీన్(65నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో కర్ణాటక జట్టు 46.2ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. అంతకుముందు ముంబయి జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(114నాటౌట్; 55బంతుల్లో 5ఫోర్లు, 10సిక్సర్లు), హార్దిక్(84), శివమ్ దూబే(63నాటౌట్; 36బంతుల్లో 5ఫోర్లు, 5సిక్సర్లు) రాణించడంతో ముంబయి 50ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 382పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68